## నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

ప్రియ వచనము లేక ప్రేమను జూపక
రోజు రోజు గూడ రోయుకొనుచు
జాలి చూపకుండ చరియించు నట్లున్న
తల్లి కన్న సవతి తల్లి మేలు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 352 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 17-04-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


## తెలంగాణలో పెట్టుబడులు

# పెట్టండి

**ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామి**

- ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మేడిన్ తెలంగాణ' మార్క్
- అమెరికా పెట్టుబడిదారులకు తెలయి చేయండి
- అమెరికన్ నేషనల్ వార్ కాలేజీ బృందంతో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్,

తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని అమెరికా పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. డ్రోన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో భారీ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అమెరికా 'నేషనల్ వార్ కాలేజ్' బృందంతో గురువారం మంత్రి సమావేశమయ్యారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో స్కిల్డ్ వర్క్ ఫోర్స్ సిద్ధంగా ఉందని.. 15 నుంచి 30 రోజుల్లోనే అన్ని అనుమతులు లభించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.-మిగతా 2 లో





## ఇజ్రాయెల్, లెబనాన్

# మధ్య సీజ్‌ఫైర్..

- 10 రోజుల పాటు కాల్పుల విరమణ
- ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- దీనితో కలిపి 10 యుద్ధాలు తానే ఆపానని వెల్లడి

వాషింగ్టన్,

ఇజ్రాయెల్, లెబనాన్ దేశాలు 10 రోజుల పాటు కాల్పుల విరమణకు అంగీకరించాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం వెల్లడించారు. గత కొన్ని వారాలుగా రెండు దేశాల సరిహద్దుల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొని ఉన్న క్రమంలో ఇది అరుదైన దౌత్య పురోగతిగా ఆయన అభివర్ణించారు. అటు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో, ఇటు లెబనాన్ అధ్యక్షుడు జోసఫ్ ఆన్‌తో అద్భుతమైన సంభాషణలు జరిగినట్టు ట్రంప్ తెలిపారు. 'కాల్పుల విరమణ 5 పీఎం ఈఎస్‌టీ (3.30 ఏఎం, ఐఎస్‌టీ)కి ప్రారంభమవుతుంది' అని ఆయన ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. 'ప్రపంచ వ్యాప్తంగా 9 యుద్ధాలను పరిష్కరించడం నాకు దక్కిన గౌరవం. ఇది 10వది. దీనిని కూడా విజయవంతం చేద్దాం' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్, లెబనాన్‌కు చెందిన ప్రతినిధులు ఈ వారం మొదట్లో వాషింగ్టన్‌లో -మిగతా 2 లో



## దక్షిణాది నేతలతో భారీ

# బహిరంగ సభ

- డీలిమిటేషన్‌పై సీఎం
- ఈనెలాఖరులో హైదరాబాద్‌లో నిర్వహణ

హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన అసంబద్ధమైన నియోజకవర్గాల పునర్ విభజన, డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తూ దక్షిణాది రాష్ట్రాల గొంతుకను వినిపించాలని అధికార కాంగ్రెస్ నిర్ణయించింది. ఆయా రాష్ట్రాల నేతలతో ఈనెలాఖరులో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభకు ఆ పార్టీ సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ఏర్పాట్లు చేపట్టాలంటూ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. -మిగతా 2 లో

# పునర్విభజనపై భగ్గుమన్న తమిళనాడు

- బిల్లు ప్రతులను తగులబెట్టిన ముఖ్యమంత్రి స్టాలిన్
- రాష్ట్రమంతటా బ్లాక్ డే పేరుతో నిరసనలు
- నల్లజెండాలు ఎగురవేసిన సిపిఎం నాయకులు

చెన్నరు

పార్లమెంటులో మహిళా రిజర్వేషన్‌తో ముడిపెట్టి డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెట్టిన రోజే తమిళనాడు అంతటా నిరసనలు హోరెత్తాయి. గురువారం నాడు రాష్ట్ర ప్రజానీకమంతా ఒక్కతాటిపైకి వచ్చి 'బ్లాక్ డే' పేరిట నిరసన ప్రదర్శనలు చేపట్టారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ డీలిమిటేషన్ బిల్లు ప్రతులను తగులబెట్టి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఒంటెద్దు పోకడలను సహించబోమని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్త నిరసనల్లో భాగంగా నమ్మక్కల్‌లో ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఇదొక నల్ల చట్టమని, -మిగతా 2 లో



## ఇండియా,పాకిస్తాన్‌లా ఆంధ్రప్రదేశ్ విభజన



- తెలంగాణ, ఏపీ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వివాదాస్పద వ్యాఖ్యలు
- ప్రతిపక్ష ఎంపీల మండిపాటు
- క్షమాపణ చెప్పాలని డిమాండ్

2 లో



## తెలంగాణ అంటే అంత చులకనా తేజస్వీ

- వెంటనే క్షమాపణలు చెప్పాల్సిందే
- దీనిపై బిజెపి ఎంపిలు నోరు మెదపరా
- జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపాటు

హైదరాబాద్,

తెలంగాణ ఉద్యమాన్ని ఇండియా–పాకిస్థాన్ విభజనతో పోల్చడంపై జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. మిస్టర్ తేజస్వీ సూర్య.. తెలంగాణ ప్రజల 6 దశాబ్దాల ఆకాంక్ష అంటే నీకు అంత చులకనా? ఎంత ధైర్యం ఉంటే ఇక్కడి పోరాటాన్ని అంతలా కించపరుస్తావు? అంటూ నిప్పులు చెరిగారు. ఆరు దశాబ్దాల వివక్షకు వ్యతిరేకంగా, ఆత్మగౌరవం కోసం చేసిన ఈ -మిగతా 2 లో

## మహిళా బిల్లుతో

# చరిత్ర సృష్టిద్దాం

**ఇందులో ఎలాంటి రాజకీయం లేదు**

- 30 ఏళ్లుగా మహిళలు ఎదురు చూస్తున్నారు
- వారికి అవకాశం ఇవ్వడం మన బాధ్యత
- చట్టసభల్లోనూ వారి సత్తా చాటేలా చేద్దాం
- ఈ బిల్లు ఆమోదంలో నాకు క్రెడిట్ వద్దు
- ఏకగ్రీవంగా ఆమోదించే విపక్షాలకే దక్కుతుంది
- దీనిని విస్మరించే వారిని మహిళలు క్షమించరు
- ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన తేవద్దు
- డీలిమిటేషన్‌తో దక్షిణాదికి ఎలాంటి అన్యాయం జరగదు
- మహిళా బిల్లుపై పార్లమెంటులో ప్రధాని మోడీ ప్రసంగం

న్యూఢిల్లీ

మహిళా రిజర్వేషన్ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దు అని ప్రధాని మోదీ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఏ పార్టీకి అనుకూలం కాదు అన్నారు. దానికి రాజకీయ రంగు పూయవద్దు అన్నారు. ఎవరు బాధ్యులైనా, ఇప్పటికే మహిళా రిజర్వేషన్ బిల్లును ఆలస్యం చేశామన్నారు. ఈ బిల్లులను తీసుకువచ్చిన సక్సెస్ ట్రెజరీ బెంచ్‌లకు కానీ, మోదీకి కానీ దక్కదని, ఇది భారత ప్రజాస్వామ్యానికి దక్కుతుందని ఆయన అన్నారు. లోక్‌సభలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను ప్రవేశపెట్టిన నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. పార్లమెంట్ ప్రత్యేక -మిగతా 2 లో







## పక్కా ప్లాన్ ప్రకారమే

# సమావేశాలు

- లోక్‌సభ సీట్లు పెంచడంపైనే మీ దృష్టి
- మహిళా రిజర్వేషన్లను ఎవ్వరూ వ్యతిరేకించడం లేదు
- చాణుక్యుడు బతికుంటే మీ కుయుక్తికి ఆశ్చర్య పోయేవాడు
- లోక్‌సభలో ప్రియాంక సెటైర్లు...అమిత్‌షా నవ్వులు

న్యూఢిల్లీ,

కేంద్రం ప్రతిపాదించిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఎంపీ ప్రియాంకా గాంధీ మాట్లాడుతూ...చాణుక్యుడు కూడా ఇంత పక్కాగా ప్లాన్ చేసి ఉండలేదని అన్నారు. మహిళా కోటా బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదని, అయితే దీనిని అమలు చేయడానికి డీలిమిటేషన్ చేస్తుండటంపైనే తమ అభ్యంతరాలు ఉన్నాయని లోక్‌సభలో ఆమె అన్నారు. ఎన్నికల్లో పైచేయి సాధించడానికి ఇది ఒక రాజకీయ అస్త్రం అని ఆమె ఆరోపించారు. భారత రాజ్యాంగాన్ని దెబ్బతీయడానికి బీజేపీ తన పార్టీ పునాదులను బలోపేతం చేసుకుంటోందని ఆమె అన్నారు. ఇదిలా ఉంటే, -మిగతా 2 లో

### పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు

## హైకోర్టు నోటీసులు



2 లో



## టీవీకే మ్యానిఫెస్టో

# విడుదల

- పేదింటి అమ్మాయి పెండ్లికి 8 గ్రాముల బంగారం
- మహిళలకు నెలకు రూ. 2,500
- అన్నదాతలకు రుణ మాఫీ

చెన్నై:

త్వరలో జరుగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి టీవీకే అధినేత విజయ్ తమ పార్టీ మ్యానిఫెస్టోను గురువారం విడుదల చేశారు. పేదింటి అమ్మాయి పెండ్లికి 8 గ్రాముల బంగారం, నాణ్యమైన పట్టుచీర అందజేస్తామని హామీ ఇచ్చారు. 60 ఏండ్లలోపు మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు.5 ఎకరాల్లోపు రైతులకు పంట రుణాలు మాఫీ, క్వింటా ధాన్యంపై రూ.3,500 కనీస మద్దతు ధర చెల్లింపు, స్వయం సహాయక సంఘాలకు రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు, యువతకు రూ.4 వేలు నిరుద్యోగ భృతి, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు వంటి హామీలు మ్యానిఫెస్టోలో ప్రకటించారు.

## తెలంగాణలో 17 నుంచి

# 26కు ఎంపీల సంఖ్య

**ఏపీలో 25 నుంచి 38కి పెరుగుదల**



- డీలిమిటేషన్‌పై హోంమంత్రి అమిత్ షా వెల్లడి
- దక్షిణాదికి అన్యాయం జరగదని వివరణ

న్యూఢిల్లీ,

డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఇది కావాలని చేస్తున్న ప్రచారంగా తిప్పికొట్టారు. ఏపీలో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి పెరుగుతాయన్నారు. తెలంగాణలో 17 నుంచి 26కు పెరుగుతాయని చెప్పారు. కర్ణాటకలో 28 నుంచి 42కు, -మిగతా 2 లో

## స్వదేశీ యాంటీషిప్ మిస్సైల్‌ను పరీక్షించిన పాక్ నేవీ



2

## తెలంగాణ అంటే అంత చులకనా తేజస్వీ

మొదటి తరువాయి

మహోద్యమాన్ని తక్కువ చేసి మాట్లాడటం అజ్ఞానానికి పరాకాష్ఠ అని విమర్శించారు. తెలంగాణ సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను కూడా తేజస్వీ సూర్య తన వ్యాఖ్యలతో అవమానించారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం రాజకీయ విమర్శ కాదని, తెలంగాణ అస్తిత్వంపై జరిగిన దాడి అని ఆమె అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఎవరు మాట్లాడినా సరే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ బీజేపీ ఎంపీలపై కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ సమాజాన్ని అవమానించేలా మీ పార్టీ ఎంపీ మాట్లాడుతుంటే.. మీరు ఎందుకు మౌనంగా ఉన్నారు? ఈ వ్యాఖ్యలను మీరు సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు. వెంటనే తేజస్వీ సూర్యతో క్షమాపణలు చెప్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడే సత్తా లేకపోతే, ఎంపీలుగా కొనసాగే అర్హత మీకు లేదని, వెంటనే పదవులకు రాజీనామా చేయాలని ఘాటుగా వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం కేంద్ర ప్రభుత్వ పెద్ద కుట్ర అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మహిళల భుజాలపై తుపాకీ పెట్టి, డీలిమిటేషన్ బిల్లును కాల్చే ప్రయత్నం కేంద్రం చేస్తోందని ఆమె విమర్శించారు. డీలిమిటేషన్ బిల్లుపై ఢిల్లీ వేదికగా కవిత మాట్లాడుతూ.. 'మహిళా బిల్లుకు డీలిమిటేషన్ బిల్లును లింక్ చేయటం పెద్ద కుట్ర. మహిళల భుజాలపై తుపాకీ పెట్టి డీలిమిటేషన్ బిల్లును కాల్చే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణకు రాజకీయ ప్రాధాన్యం తగ్గిస్తే ఊరుకునేది లేదు. ఒకవేళ డీలిమిటేషన్ పేరుతో తెలంగాణ సీట్ల సంఖ్యను తగ్గిస్తే, రాష్ట్ర ప్రయోజనాల కోసం మరో ఉద్యమం తప్పదు. మహిళా రిజర్వేషన్లలో కచ్చితంగా బీసీ సబ్ కోటా ఉండాలి. అప్పుడే వెనుకబడిన వర్గాల మహిళలకు చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం దక్కుతుంది' అని అన్నారు.

## పక్కా ప్లాన్ ప్రకారమే సమావేశాలు

మొదటి తరువాయి

చాణక్యుడిని ప్రస్తావిస్తూ ఆమె వేసిన సెటైర్లు సభలో నవ్వులు పూయించాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా ప్రియాంకా వ్యాఖ్యలకు నవ్వారు. మీరంతా పక్కా ప్లాన్‌తో వచ్చారు. ఈ రోజు గనుక చాణక్యుడు బతికి ఉంటే మీ కుయుక్తికి ఆయన ఆశ్చర్యపోయి ఉండేవారని ఆమె అన్నారు. రాష్ట్ర ఎన్నికల సమయంలో హఠాత్తుగా పార్లమెంట్ ఏర్పాటు చేయడం, ఎన్నికలకు ఒక రోజు ముందే ముసాయిదా ముందుకు తేవడం, మహిళా అభ్యున్నతి కోసం మోదీ అతిపెద్ద నిర్ణయం తీసుకున్నారని మీడియాలో చర్చ జరిపించడం, ప్రతీ ఒక్కరూ ఆయనకు మద్దతు ఇచ్చేలా చేయడం, ఇలా ప్రతిపక్షాలను సందిగ్ధంలో పడేయడం అంతా ప్లాన్ అంటూ ఆమె ఆరోపించారు. ఈ వ్యాఖ్యలకే అమిత్ షాతో పాటు మంత్రులు కిరెన్ రిజిజు నవ్వారు. అంతకుముందు ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగాన్ని తప్పుబట్టిన ఆమె.. అందులో జవహర్‌లాల్ నెహ్రూ పేరు వినిపించకపోవడం గమనార్హం అని అన్నారు. మహిళల హక్కుల పట్ల బీజేపీ నేతలే ఛాంపియన్లుగా భావిస్తున్నారని ఆమె విమర్శించారు. మోదీ ప్రసంగంలో నెహ్రూ పేరు వినిపించకపోవడం ఆశ్చర్యం కలిగించింది. రిజర్వేషన్లపై 2018లోనే ప్రధాని నరేంద్ర మోదీకి రాహుల్ గాంధీ లేఖ రాశారు. 2019లోపే రిజర్వేషన్లు అమలు చేయాలని రాహుల్ కోరారు. ప్రధాని మోదీ సగం సమాచారం మాత్రమే వెల్లడించారు. ఇవాళ ప్రధానంగా రిజర్వేషన్ల కోటాపై చర్చ కాదు.. లోక్‌సభ సీట్లను 850కి పెంచడంపైనే. మోదీ ప్రభుత్వం లోక్‌సభ సీట్ల పెంపుపైనే ఆసక్తి కనబరుస్తోంది. ఆ విషయంలో ప్రభుత్వానికి అంత తొందరెందుకని ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఎవరూ వ్యతిరేకించలేదు. రాహుల్ స్వయంగా మోదీ దగ్గరకు వెళ్లి మరీ మద్దతు తెలిపారు. ఆ బిల్లుపై క్రెడిట్‌ను మోదీ.. కాంగ్రెస్‌కు ఇవ్వలేదు. దేశ మహిళలకు కాంగ్రెస్ ఎంతో సేవ చేసింది. బిల్లు విషయంలో మహిళలను బీజేపీ తప్పుదోవ పట్టిస్తోంది. మహిళా బిల్లును ఎవరు వ్యతిరేకిస్తున్నారో మోదీ చెప్పాలి. కులగణనకు మోదీ ఎందుకు భయపడుతున్నారు? ఓబీసీలకు న్యాయం జరగాలి.. వారి హక్కులను ఎవరూ కాలరాయలేరు' అని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు.

## తెలంగాణలో 17 నుంచి 26కు ఎంపీల సంఖ్య

మొదటి తరువాయి

తమిళనాడులో 39 నుంచి 59కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయని చెప్పారు. దక్షిణాది జనాభా శాతం కంటే ఎక్కువ సీట్లు పెరుగుతాయని పేర్కొన్నారు. విపక్షాలు అవాస్తవాలు చెబుతూ ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ సంబంధిత బిల్లులపై లోక్‌సభలో చర్చ సందర్భంగా అమిత్ షా ఈ వివరాలు వెల్లడించారు. జనాభా గణన ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, కుల గణన నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని , ప్రస్తుతం గృహ గణన పనులు జరుగుతున్నాయని, జనాభా గణన జరిగినప్పుడు కుల గణన కూడా చేర్చుతామని ఆయన చెప్పారు. మత ఆధారిత రిజర్వేషన్ల ఆలోచనను అమిత్ షా తిరస్కరించారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం ఆమోదయోగ్యం కాదని, మతం ఆధారంగా ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన చెప్పారు. రాజ్యాంగంలో అలాంటి అవకాశం లేదన్నారు. అఖిలేష్ యాదవ్ డిమాండ్లపై విమర్శలు చేస్తూ.. అఖిలేష్ యాదవ్ తన పార్టీ టికెట్లన్నీ ముస్లిం మహిళలకు ఇవ్వొచ్చని, ఆయన పార్టీకి ఎలాంటి సమస్యల ఉండదని, తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన అన్నారు.

## పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు

**-మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశం..**
**-విచారణ జూన్ 6కు వాయిదా**



హైదరాబాద్
పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన తొమ్మిది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేసిన కేసులో ఫిరాయింపుదారులుగా చెబు తున్న వాళ్లకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఫిరాయింపుదారులు కాదంటూ స్పీకర్ ఇటీవల ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలంటూ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులో తెలిపింది. ఆ తర్వాత కౌంటర్లు దాఖలు చేయాలని పిటిషనర్లను ఆదేశిం చింది. విచారణను జూన్ 6వ తేదీకి వాయిదా వేసింది. బీఆర్ఎస్ తరఫున ఎంపికై కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన దానం నాగేందర్, కడియం, శ్రీహరి, పోచారం శ్రీనివాసరెడ్డి, యాదయ్య, కృష్ణమోహన్ రెడ్డి, టి.ప్రకాశ్ గౌడ్, ఎ.గాంధీ, తెల్లం వెంకటరావు, సంజరుకుమార్, గూడెం మహిపాల్‌రెడ్డిలపై అనర్హత వేటు వేసేందుకు స్పీకర్ నిరాకరిస్తూ తీర్పు చెప్పారు. ఈ తీర్పులను సవాలు చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జి.జగదీశ్‌రెడ్డి, కె.పి.వివేకానంద, కె.సంజరు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సీహెచ్.ప్రభాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ అసెంబ్లీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిటిషన్లు వేశారు. వీటిని హైకోర్టు చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన బెంచ్ గురువారం విచారించింది.

## పునర్విభజనపై భగ్గుమన్న తమిళనాడు

మొదటి తరువాయి

పెద్ద కుట్ర అని విమర్శించారు. విస్తృత సంప్రదింపులతో ఏకాభిప్రాయాన్ని సాధించిన తర్వాతే డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉత్తరాది రాష్ట్రాలను, దక్షిణాది రాష్ట్రాలను వేరు చేసి అన్యాయం చేయాలని చూస్తే సహించబోమన్నారు. సమాఖ్య స్ఫూర్తిని నీరుగార్చే ఏ ప్రయత్నాన్ని సాగనివ్వమని ఆయన హెచ్చరించారు. 'తమినాడు నిరసిస్తుంది, తమిళనాడు విజయం సాధిస్తుంది' అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆది ద్రవిడ సంక్షేమ శాఖ మంత్రి మతివెంతన్, ఎంపీ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారం నిమిత్తం నమ్మక్కల్‌లో వున్న ముఖ్యమంత్రి తర్వాత డిఎంకె అభ్యర్థి రాణి తరపున ప్రచారం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంట్లోనూ, బహిరంగ ప్రదేశాల్లో నల్ల జెండాలు ఎగురవేసి ప్రజలు కేంద్ర ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేశారు.

# మహిళా బిల్లుతో చరిత్ర సృష్టిద్దాం

మొదటి తరువాయి

సమావేశాల్లో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంలో క్రెడిట్ ఎవరిదన్న దానిపై ఆలోచించరాదు అన్నారు. కావాలంటే మీరు క్రెడిట్ తీసుకోవచ్చు అని ఆయన ప్రతిపక్షాలకు చెప్పారు. ముందుగా 33 శాతం మంది మహిళలు ఇక్కడకు రావాలన్నారు. భారతీయ సోదరీమణులను నమ్మండి అని, వారి ఇంటెలిజెన్స్‌ను గుర్తించాలన్నారు. నారీ శక్తి వికసిత్ భారత్‌కు ఉపయోపడుతుందన్నారు. మనం తీసుకోబోయే నిర్ణయాన్ని మహిళలు వీక్షిస్తున్నారని, మన ఉద్దేశాలను కూడా గమనిస్తున్నారన్నారు.మహిళా రిజర్వేషన్ ప్రక్రియను మరింత ఆలస్యం చేయవద్దు అన్నారు. రాజ్యాంగ సవరణ బిల్లులతో ఏ రాష్ట్రానికి అన్యాయం జరగదు అని, ఎవర్నీ వివక్షపూరితంగా చూడబోమన్నారు. అలాగే దక్షిణాదికి అన్యాయం అంటున్న వాదనలో కూడా వాస్తవం లేదన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో తనకు క్రెడిట్ అవసరం లేదని మోదీ అన్నారు. ఒకవేళ బిల్లు పాసైన తర్వాత.. ఎవరైనా కావాలంటే వారి పేరు, ఫోటో మీద ఫుల్ పేజీ యాడ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అందరి అచీవ్‌మెంట్‌గా చూడాలన్నారు. ఇది ఏ ఒక్క వ్యక్తి, లేదా రాజకీయ పార్టీకి చెందిన సక్సెస్ కాదన్నారు. కానీ ఒకవేళ మూడు దశాబ్దాల తర్వాత కూడా ఈ సంస్కరణ చేపట్టకపోతే, అప్పుడు ఆ లబ్ది ఏ పార్టీకి దక్కదని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించేవారు భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకుంటారన్నారు. డీలిమిటేషన్ అంశంలో గ్యారెంటీ ఇవ్వనున్నట్లు ప్రధాని తెలిపారు. గ్యారెంటీ, ప్రామిస్ పదాలు వాడమంటే వాడుతానని, ఒకవేళ తమిళంలో దీనికి తగిన పదం ఏదైనా ఉందంటే దాన్ని కూడా చెబుతానని, మన ఉద్దేశం స్వచ్ఛమైందైతే, అప్పుడు పదాలతో ఆడాల్సిన అవసరం ఉండదని ఆయన అన్నారు. దేశ చరిత్రలో ఇదో కీలక ఘట్టమని ఈ సందర్భంగా మోదీ వ్యాఖ్యానించారు. కాలానుగుణంగా మనం కూడా మారాలన్నారు. వాస్తవానికి ఈ బిల్లును 30 ఏళ్ల క్రితమే ఆమోదించాల్సిందని చెప్పుకొచ్చిన ఆయన.. ఇది దేశ చరిత్రలోనే గొప్ప బిల్లు అని అభిప్రాయపడ్డారు. ఈ బిల్లును ఆమోదించడం ప్రస్తుత పార్లమెంట్‌కు ఓ కీలక సువర్ణావకాశమని ఈ సందర్భంగా మోదీ పేర్కొన్నారు. 'దేశానికి సరికొత్త దిశను సూచించే ప్రయత్నం చేస్తున్నాం. దేశంలోని సగం జనాభాకు అధికారం ఇవ్వడం అద్భుత ఘట్టం. వికసిత్ భారత్ అంటే మౌలిక వసతుల కల్పనే కాదు.. మహిళలకు అధికారం ఇవ్వడం కూడా. వికసిత్ భారత్‌లో మహిళల భాగస్వామ్యమే లక్ష్యం. మహిళలకు అధికారమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. మహిళలకు నిర్ణయాధికారం ఇవ్వడమే మా లక్ష్యం. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవు. ఈ విషయంలో విపక్షాలను మహిళలు ఎప్పటికీ క్షమించరు' అని ప్రధాని చెప్పుకొచ్చారు. పంచాయతీల్లో రిజర్వేషన్లకు అందరూ అంగీకరించారు. లోక్‌సభలో మాత్రం బిల్లును అడ్డుకుంటున్నారు. ఈ బిల్లుకు మద్దతిచ్చే రాజకీయ పార్టీలకే మనుగడ ఉంటుంది. 30 ఏళ్లలో ఇదే అంశం రుజువైంది. మహిళల్లో రాజకీయ చైతన్యం పెరిగింది. అత్యున్నత చట్టసభల్లోనూ భాగస్వామ్యం కోరుతున్నారు. చీపురు పనికాదు.. పార్లమెంట్‌లో సీట్లు అడుగుతున్నారు. ఇప్పుడు బిల్లును వ్యతిరేకించిన వారిని మహిళలే శిక్షిస్తారు' అని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతానికి 33 శాతం రిజర్వేషన్లు అమలుచేయని వ్వండని.. ఆ తర్వాత ఓబీసీ, ఇతర వర్గాల కోటాపై ఆలోచిద్దామని పార్లమెంట్ వేదికగా మోదీ కోరారు. 'పార్లమెంట్‌పై నాకు నమ్మకం ఉంది. అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన నాకు ప్రధాని పదవి దక్కింది. తప్పకుండా ఓబీసీలకు న్యాయం చేస్తాం. మహిళా రిజర్వేషన్‌కు రాజకీయ రంగు పులమొద్దు. ఈ బిల్లు రాజకీయ పార్టీల కోసం కాదు.. మహిళల కోసమే అంటూ.. రిజర్వేషన్లు మహిళల హక్కు. 2029లో రిజర్వేషన్లు అమలు చేయకపోతే మహిళలకు అన్యాయం జరిగినట్టవుతుంది. వికసిత్ భారత్ సాధనలో మహిళలదే కీలక పాత్ర. ఇప్పటికైనా మహిళా రిజర్వేషన్ ఆలస్యం కాకూడదు. దీనికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు. 'దేశమంతా ఒక్కటే.. ప్రాంతీయ భేదాలు ఉండకూడదు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని ప్రాంతాలూ సమానమే. ఉత్తర భారతం, దక్షిణ భారతం అనే తేడా మాకు లేదు. చిన్న రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదు. దేశాన్ని ముక్కలు చేసే అధికారం మనకు లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై నాకు ఎలాంటి క్రెడిట్ అవసరం లేదు. అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతూ శుక్రవారం ప్రకటన చేస్తా. నా స్వార్థం కోసం బిల్లు అంటూ తప్పుడు ప్రచారం చేయవద్దు' అని మోదీ తన ప్రసంగంలో వివరించారు. ఈ బిల్లులతో దేశానికి సరికొత్త దశ, దిశను ఇస్తున్నాం. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు. మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్ అవుతుంది. దేశ రాజకీయాల్లో, వికసిత్ భారత్ సాధనలో మహిళల పాత్ర కీలకం. మహిళలకు అవకాశమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. రాజకీయాల్లో తమ శక్తిని చాటేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఎవరికైనా అవకాశమిస్తేనే కదా.. వారి సామర్థ్యం తెలుస్తుంది. రాజకీయాల్లో సామర్థ్యం, అనుభవం ఉన్న మహిళలు పుష్కలంగా ఉన్నారు. దేశ ప్రగతిలో మహిళలకూ భాగస్వామ్యం కల్పించాల్సిందే. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు.. మహిళలకు మనం ఇస్తున్న కానుక కాదు. అది వారి హక్కు అని మోదీ వ్యాఖ్యానించారు. 2024 ఎన్నికల్లో వీటిని అమలు చేద్దామని మేం ప్రయత్నించినా సాధ్యం కాలేదు. 2029 ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు ఇవ్వకపోతే మహిళలకు అన్యాయం చేసినట్లేనని అన్నారు. బిల్లును తీసుకురాగానే కొందరు విభజన రాజకీయాలు చేస్తున్నారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ మాట్లాడుతున్నారు. అలాంటి వారిని ప్రజలు ఇప్పటికే దూరం పెట్టారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం, ఉత్తరాది, దక్షిణాది అనే భేదభావం మాకు లేదు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాం అని మోదీ స్పష్టం చేశారు.


## ఇండియా,పాకిస్తాన్‌లా ఆంధ్రప్రదేశ్ విభజన

**–తెలంగాణ, ఏపీ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వివాదాస్పద వ్యాఖ్యలు**
**-- ప్రతిపక్ష ఎంపీల మండిపాటు**
**-- క్షమాపణ చెప్పాలని డిమాండ్**



న్యూఢిల్లీ
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గురువారం లోక్‌సభలో మహిళా రిజర్వేషన్లు, సీట్ల పెంపు సవరణ బిల్లులపై చర్చలో భాగంగా రాష్ట్ర విభజనను తప్పుబట్టేలా విమర్శలు చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును పాకిస్తాన్‌తో పోల్చారు. " బ్రిటీషర్స్ కంటే చెత్తగా తెలుగు రాష్ట్రాన్ని కాంగ్రెస్ విభజించింది. ఆనాడు ఇండియా-పాకిస్తాన్ విభజన మాదిరిగా తెలంగాణ, ఏపీని విభజించారు. విభజన సమయంలో కాంగ్రెస్ వ్యవహరించిన తీరుతో ఇప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఘర్షణ వాతావారణం నెలకొంది' అని ఆయన విమర్శించారు. అలాగే డీలిమిటేషన్‌పై ప్రతి పక్షాలు దక్షిణాది రాష్ట్రాల ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని తేజస్వీ ఆరోపించారు. మహిళా రిజర్వేషన్, తదితర బిల్లులను ఎలాగైనా అడ్డు కోవాలని, ప్రతిపక్షాలు కొత్తదారులు వెతుకుతు న్నాయని మండిపడ్డారు. ఈ సందర్భంగా దేశంలో నియోజకవర్గాల పునర్విభజన విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించిన హైబ్రీడ్ ఫార్ములాపై తేజస్వీ సభలో ప్రస్తావిం చారు. ఆ ప్రతిపాదనను ఆయన కొట్టిపారేశారు. సీట్ల సంఖ్య ఆధారంగా జీడీపీకి ముడిపెట్టాలన్న సీఎం రేవంత్‌రెడ్డి సలహా అత్యంత తెలివి తక్కువైనదని అన్నారు. అలాంటి ప్రతిపాదనతో ముందుకెళితే ఒక వ్యక్తి, ఒక ఓటు అన్న రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రానికి విలువే ఉండదన్నారు. రాష్ట్రాల ఆదాయం ఏటా మారుతూ ఉంటుందని, దానిని డీలిమిటేషన్ ప్రతిపాదికన తీసుకోవడం సరికాదని చెప్పారు. ఆదాయం ప్రకారం ఓట్లు ఇవ్వాలని అనుకుంటే.. దేశంలో అత్యంత ఆదాయనం ఉన్న అంబానీ లక్ష ఓట్లు ఇవ్వాల్సి వస్తుందని సెటైర్లు వేశారు.

## స్వదేశీ యాంటీషిప్ మిస్సైల్‌ను పరీక్షించిన పాక్ నేవీ



**కరాచీ:**
స్వదేశీయంగా అభివృద్ధి చేసిన యాంటీషిప్ మిస్సైల్‌ను ఇవాళ పాకిస్థాన్ నేవీ విజయవంతంగా పరీక్షించింది. చాలా దూరంలో ఉన్న టార్గెట్లను ఆ మిస్సైల్ చేరుకోగలదని పాక్ మిలిటరీ పేర్కొన్నది. నౌకల నుంచి లాంచ్ చేసే ఆ యాంటీషిప్ మిస్సైల్‌ను నేవీ విజయవంతంగా పరీక్షించినట్లు ఐఎస్పీఆర్ ప్రకటించింది. నేవీ చీఫ్ అడ్మిరల్ నవీద్ అష్రఫ్‌తో పాటు ఇతర శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు మిస్సైల్ ఫైరింగ్ ఈవెంట్‌ను వీక్షించారు. అత్యాధునిక గైడెన్స్ సిస్టమ్‌తో పాటు అడ్వాన్స్‌డ్ మాన్యువరబులిటీ ఉన్నట్లు పేర్కొన్నారు. శత్రువుల క్షిపణుల నుంచి తప్పించుకునే సామర్థ్యం ఉన్నట్లు ప్రకటనలో తెలిపారు. పరిస్థితులకు తగినట్లు డైనమిక్‌గా మారుతుందని, చాలా కచ్చితత్వంతో ఆ క్షిపణి ప్రాణాంతకంగా మారుతుందని మిలిటరీ పేర్కొన్నది. ప్రాంతీయ సముద్ర భద్రత, స్థిరత్వం నేపథ్యంలో మిస్సైల్ ఫైరింగ్ ఈవెంట్ నిర్వహించినట్లు చెప్పారు. అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారి, ప్రధాని షెహబాజ్ షరీఫ్, సీడీఎఫ్ అసిమ్ మునీర్ తాజా పరీక్ష పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

మొదటి తరువాయి

అమెరికాతో దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. టెక్నాలజీ, రీసెర్చ్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో సహకారాన్ని మరింత పెంచాలని మంత్రి శ్రీధర్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఏరోస్పేస్ రంగం ఏటా సగటున 30 శాతం వృద్ధి నమోదు చేస్తోంది. ఎగుమతుల్లో 103 శాతం సీఏజీఆర్‌తో తెలంగాణ దూసుకుపోతోంది. రాకెట్ల నుంచి శాటిలైట్ల వరకు అన్ని ఉత్పత్తులపై 'మేడ్ ఇన్ తెలంగాణ' ముద్ర పడుతోంది. ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఇప్పటికే తెలంగాణలో తమ కార్యకలాపాలు విస్తరించాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 1500కి పైగా ఎంఎస్ఎంఈలతో తెలంగాణ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదుగుతోంది. 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ టాప్ స్థానంలో నిలిచింది. వరుసగా ఐదు సార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును అందుకోవడం తెలంగాణ సాధించిన మరో విజయం. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా దూసుకెళ్తున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా అమెరికా పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించాలని, ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, ఏరోస్పేస్ కాంపోనెంట్స్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్, సైబర్ సెక్యూరిటీ, స్పేస్ టెక్నాలజీ, ఏఐ ఇన్ డిఫెన్స్, శాటిలైట్స్ సిస్టమ్స్ అండ్ అడ్వాన్స్డ్ కమ్యూనికేషన్స్ లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్ గా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో తెలంగాణలో ఉన్న అవకాశాలు, ఇక్కడి అనుకూలతలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పాలసీలు మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వివరించారు. రాకెట్ల తయారీ నుంచి అత్యాధునిక డ్రోన్ల వరకు, యుద్ధ విమానాల విడిభాగాల నుంచి శాటిలైట్ల వరకు... అన్నింటిలోనూ 'మేడిన్ తెలంగాణ' మార్క్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోందన్నారు. ఈ రంగంలో తెలంగాణ ఏటా 30 శాతానికి పైగా వృద్ధిని రేటును నమోదు చేస్తోందన్నారు. అలాగే... 2024-26 మధ్య కాలంలో ఎగుమతుల్లో 103 శాతం కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్(సీఏజీఆర్) నమోదయ్యిందన్నారు. లాక్హీడ్ మార్టిన్, బోయింగ్, సాఫ్రాన్, ఎయిర్ బస్, డస్సాల్ట్ ఏవియేషన్ తదితర ప్రపంచ దిగ్గజ ఏరోస్పేస్ కంపెనీలతో డీఆర్డీవో, భెల్, మిధాని, బీడీఎల్,ఆర్ సీఐ, హాల్ తదితర కేంద్ర రంగ ప్రభుత్వ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఇవీ కాకుండా... ప్రిసిషన్ ఇంజనీరింగ్, డ్రోన్లు, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 1,500 కంటే ఎక్కువ ఎంఎస్ఎంఈలు 'తెలంగాణ బ్రాండ్'ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. ఫైనాన్షియల్ టైమ్స్ ఎఫ్ డీఏ ర్యాంకింగ్స్ ప్రకారం, ప్రపంచంలోనే అత్యంత 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వరుసగా ఐదుసార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును గెలుచుకుని 'గ్లోబల్ ఏరోస్పేస్ మ్యాప్'లో తెలంగాణ ఒక శక్తిమంతమైన కేంద్రంగా మారిందన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు అవసరమైన ఎకో సిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు.

## ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య సీజ్‌ఫైర్..

మొదటి తరువాయి

సమావేశమయ్యారని, ఇలా ఇద్దరూ సమావేశం కావడం 34 ఏండ్లలో ఇదే తొలిసారని ఆయన చెప్పారు. ఈ చర్చల్లో యూఎస్ విదేశాంగ మంత్రి రూబియో కూడా పాల్గొన్నారని ట్రంప్ వెల్లడించారు.

**తెలివైన నిర్ణయం తీసుకోండి.. లేకపోతే..**

శాంతి ఒప్పందానికి ఒప్పుకోకపోతే అనంతర పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఇరాన్‌ను అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ మరోసారి హెచ్చరించారు. 'ఇరాన్ విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడి చేయడానికి అమెరికా సిద్ధంగా ఉంది.' అని పేర్కొన్నారు. 'ఇరాన్ కనుక తెలివితక్కువ నిర్ణయం తీసుకుంటే దాని మౌలిక సదుపాయాలు, విద్యుత్తు, ఇంధన రంగాలపై దిగ్బంధనం, బాంబుల వర్షం కురుస్తుంది' అని హెగ్సెత్ తెలిపారు. 'మీకు చెప్పేదేమిటంటే.. మేము మిమ్మల్ని గమనిస్తున్నాం. మీరు ఏ మిలిటరీ ఆస్తులను తరలిస్తున్నారో మాకు తెలుసు' అని అన్నారు. తాము మునుపటి కన్నా పూర్తి శక్తిమంతంగా, సన్నద్ధతతో వస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ కనుక శాంతి ఒప్పందానికి సుముఖత చూపకపోతే తాము అనుకున్నంత కాలం హొర్ముజ్ జలసంధిని దిగ్బంధించగలమని ఆయన హెచ్చరించారు.

## దక్షిణాది నేతలతో భారీ బహిరంగ సభ

మొదటి తరువాయి

డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు జరిగే నష్టాన్ని వివరిస్తూ ముఖ్యమంత్రి ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ, తమిళనాడు సీఎంలకు లేఖలు రాసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో బహిరంగ సభకు రావాలంటూ వారికి వర్తమానం పంపాలని రేవంత్ రెడ్డి సూచించారు. ఇదే అంశంపై చర్చించి, కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనలను తిరస్కరిస్తూ కార్యాచరణ చేపట్టేందుకు వీలుగా ఆయన ఏఐసీసీ పెద్దలతో సమాలోచనలు జరిపారు. ఇందుకోసం బుధవారం ఢిల్లీ వెళ్లిన సీఎం... గురువారం వరకూ అక్కడే ఉండనున్నారు. కాగా గత పార్లమెంటు ఎన్నికల సమయంలో బీజేపీ, ఆరెస్సెస్‌నుద్దేశించి సీఎం చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. కమలం పార్టీకి పార్లమెంటులో ఎక్కువ సీట్లు కట్టబెడితే అది రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తుందని, రిజర్వేషన్లను ఎత్తేస్తుందని ఆయన హెచ్చరించారు. అదే తరహాలో ఇప్పుడు డీలిమిటేషన్ అంశాన్ని తీవ్ర స్థాయిలో చర్చనీయాంశం చేయాలని సీఎం భావిస్తున్నట్టు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. దీనికి తెలంగాణ నాయకత్వం వహిస్తే... ఇటు ప్రభుత్వానికి, అటు పార్టీకి ఉపయుక్తంగా ఉంటుందనేది ఆయన వ్యూహంగా కనడడుతున్నది. అందువల్లే వీలైనంత త్వరగా కాంగ్రెస్ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ (పీఏసీ)ని నిర్వహించి, ఆ సమావేశంలో కార్యాచరణ ప్రకటించాలని పీసీసీ చీఫ్‌నకు సీఎం సూచించారు. డీలిమిటేషన్‌పై గతేడాది మార్చిలో తమిళనాడు సీఎం స్టాలిన్ అధ్యక్షతన చెన్నైలో దక్షిణాది రాష్ట్రాల సమావేశాన్ని నిర్వహించిన విషయం విదితమే.

# పేదవాడి ఇంటి కల నెరవేర్చిన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్




**తలకొండపల్లి, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని జూలపల్లి గ్రామంలో పేద కుటుంబానికి సొంత ఇంటి కల నెరవేరింది. ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్‌ను మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదల సంక్షేమం కోసం ట్రస్ట్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రతి కుటుంబం సొంత ఇంటి కల నెరవేర్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ కటికల శేఖర్, మాజీ జెడ్పిటిసి పద్మ నరసింహ, సర్పంచ్ ధర్మ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు ఈ సహాయాన్ని అభినందించారు.

# బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అధిక ప్రాధాన్యత -- కేఎల్ఆర్



**మహేశ్వరం, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్) మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన సామాజిక--ఆర్థిక కుటుంబ సర్వేను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. జనాభా దామాషా ప్రకారం భవిష్యత్తులో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ అవకాశాలు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ సర్వేను ఆదర్శంగా తీసుకుని దేశవ్యాప్తంగా అమలు చేయాలని కోరారు. నిపుణుల కమిటీ రూపొందించిన సర్వే వివరాలు ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, అత్యధికంగా ఉన్న కులాలకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎక్కువ సీట్లు కేటాయిస్తామని తెలిపారు. బలహీన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, వెనకబాటుతనాన్ని తగ్గించేందుకు అన్ని పార్టీలు సహకరించాలని కేఎల్ఆర్ పిలుపునిచ్చారు.

# ఈ నెల 22 నుండి సమ్మెకు జేఏసీ పిలుపు



**మహేశ్వరం, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని మహేశ్వరం డిపో గేటు వద్ద ఈ నెల 22వ తేదీ నుంచి జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సమ్మె నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు కార్మికులు అందరూ సమ్మెలో పాల్గొని తమ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ థామస్ రెడ్డి, బాబా, కమలాకర్ గౌడ్ పాల్గొన్నారు. అదేవిధంగా డిపో జేఏసీ చైర్మన్ శంకర్ నాయక్, వైస్ చైర్మన్ వెంకటేష్, సభ్యులు అత్తర్ భాష, జితేందర్, ప్రభాకర్, కృష్ణ, షరీఫ్ తదితరులు హాజరయ్యారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సమ్మె తప్పనిసరి అవుతుందని నాయకులు పేర్కొన్నారు.

# కలెక్టర్ ను సన్మానించిన బీఆర్ఎస్ శ్రేణులు



**వంగూరు, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ను వంగూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు కలెక్టర్ సేవలను ప్రశంసిస్తూ, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో ఆయన కృషి విశేషమని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీపతిరావు, సురేందర్, రాంభీష్మతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**-గురుకుల సీట్లు సాధించిన విద్యార్థులను అభినందించిన మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి.**




**దేవరకొండ ఏప్రిల్,16 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రాణిస్తున్నారని, ఉపాధ్యాయుల అంకితభావమే ఈ విజయాలకు పునాది అని మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి అన్నారు. ఇటీవల గురుకుల 5వ తరగతి ప్రవేశ పరీక్షలో కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని మండల ప్రాదేశిక ప్రాథమిక పాఠశాల నుండి ఏకంగా 30 మంది విద్యార్థులు సీట్లు సాధించిన సందర్భంగా గురువారం వారు విద్యార్థులను ఇంతటి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. కొండమల్లేపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. ఉదయ, రామ్మూర్తి, ఉపాధ్యాయులు అంజయ్య, , అంజాచారి, సైదారాణి, జ్యోతి, సుకన్య, బిల్కీస్, జయమ్మ, సంధ్య భారతి, వరలక్ష్మి, కర్ణశ్రీ, శ్రీలతలను వారు శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తున్న ఉపాధ్యాయుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. అదేవిధంగామండల పరిధిలోని చిన్న అడిశర్లపల్లి పాఠశాల నుండి 7 గురు విద్యార్థులు పరీక్ష రాయగా, 7 కి 7 గురు సీట్లు సాధించి వంద శాతం ఫలితాలు నమోదు చేయడం విశేషం. ఈ అద్భుత ప్రతిభకు కారణమైన చిన్న అడిశర్లపల్లి హెచ్ఎంరవికుమార్, టీచర్ తులసిలను వారు ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. అదేవిధంగా ధోనియాల పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు సన్మానించారు. అనంతరం రేఖ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో గురుకుల పాఠశాలలు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్యా విధానంతో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. పిల్లల భవిష్యత్తు ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రుల చేతుల్లోనే ఉంటుందని, వారిని సమాజంలో ఉన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న విద్యా విధానాన్ని ప్రజలు వినియోగించుకోవాలని, తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కొండమల్లేపల్లి సర్పంచ్ యుగంధర్ రెడ్డి, దొనియాల సర్పంచ్ రామకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు యేకుల అనిత సురేష్, అశ్విన్ రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మంగ్య నాయక్, నాయకులు ఉప్పలపల్లి జితేందర్, రవి, అంజి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

**-ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**



**దేవరకొండ ఏప్రిల్ 16.(నీలగిరి ఎక్స్ ప్రెస్).** దేవరకొండనియోజకవర్గం గుడిపల్లి మండలంలోని సింగరాజు పల్లి గ్రామంలో నిర్వహించిన "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలు నాయక్, పోలీస్ అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొని, వాహనదారులకు ఉచిత హెల్మెట్ పంపిణీ చేశారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు పలు సూచనలు చేశారు. గ్రామంలోకి వచ్చే వాహనాలకు హెల్మెట్ ధరిస్తేనే లోపటికి అనుమతించాలని సూచించారు. రాష్ట్రంలో నిత్యం రోడ్డు ప్రమాదాల్లో పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని వాటిని నివారించడానికి అవగాహన ద్వారానే సాధ్యమని భావించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో "అలైవ్ - అలైవ్" కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే వివరించారు. ప్రతి పౌరుడు బాధ్యతగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎమ్మెల్యే సూచించారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న వారు ఇద్దరు హెల్మెట్ ధరించాలని ఎమ్మెల్యే అన్నారు. కార్లలో ప్రయాణిస్తున్న వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని నిర్ధేశ వేగాన్ని మించి వాహనాలను నడపవద్దని ఎమ్మెల్యే సూచించారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా డ్రైవింగ్ చేయడం ద్వారా ప్రాణ నష్టాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాలు ప్రజల భద్రత కోసం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత, మండల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశం



**కరీంనగర్, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈరోజు కరీంనగర్ మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం, గృహ జ్యోతి, సన్న రకం, వరి బోనస్, చేయుట పెన్షన్లు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, మహిళా శక్తి బ్యాంకు లింకేజ్, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, కొత్త రేషన్ కార్డులు గురించి అధికారులు వివరించారు. అదేవిధంగా రాబోయే పథకాలు అల్పాహార పథకం, కుటుంబ జీవిత బీమా, ఇంటర్మీడియట్ వరకు మధ్యాహ్న భోజనం, వికలాంగ విద్యార్థులకు వాహనాలు, పంటల మార్పిడి, వ్యవసాయానికి సంబంధించిన కొత్త చర్యలు పై కూడా సమగ్ర సమాచారం అందించారు. ఈ సమావేశంలో సర్పంచులు, లైన్ డిపార్ట్మెంట్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘం సభ్యులు, వివోవోలు పాల్గొన్నారు. కార్యక్రమానికి టి. సునీత (ఎంపీడీవో), వి. శ్రీధర్ (గ్రామీణ అభివృద్ధి అధికారి ఉ మండల నోడల్ అధికారి), నరేందర్ (తహసిల్దార్), రెవిన్యూ డివిజనల్ అధికారి హాజరయ్యారు. ఈ సమావేశం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్న పథకాలపై అవగాహన పెంపొందించడంతో పాటు, భవిష్యత్తు అభివృద్ధి కార్యక్రమాలపై స్పష్టత కలిగింది.

## లంచం తీసుకుంటూ

# పట్టుబడ్డ ఏడీఈ సైదులు




**దేవరకొండ, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్గొండ జిల్లా దేవరకొండలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సిరికొండ సైదులు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 2025 అక్టోబర్ 29న సంభవించిన తుఫాను కారణంగా దెబ్బతిన్న కంబళపల్లి సబ్‌స్టేషన్‌కు అనుసంధానమైన 33/11 కేవీ లైన్ పునరుద్ధరణ పనులకు సంబంధించిన పది లక్షల రూపాయల బిల్లును ప్రాసెస్ చేసి, ఫార్వర్డ్ చేసినందుకు సహాయం చేస్తానని చెప్పి, ఫిర్యాదుదారుడి నుండి ముప్పై వేల రూపాయల లంచం స్వీకరిస్తూ పట్టుబడ్డాడు. అక్రమ ప్రయోజనం కోసం విధిని నిజాయితీ లేకుండా నిర్వర్తించిన ఏఈను అరెస్టు చేసి, జ్యుడిషియల్ రిమాండ్ కోసం నాంపల్లి ఎస్పీఈ ఉ ఏసీబీ కేసుల గౌరవనీయ మొదటి అదనపు ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపరచారు. కేసు దర్యాప్తులో కొనసాగుతోంది. ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ అధికారులు, ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేసిన సందర్భంలో వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు సంప్రదించాలని కోరారు. అదేవిధంగా వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ (తెలంగాణ ఏసీబీ), ట్విట్టర్ (ఏ తెలంగాణ ఏసీబీ) ద్వారా కూడా సమాచారం అందించవచ్చని తెలిపారు. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు.

# కుక్కల దాడిలో 7 గొర్రెల మృతి



**ఎలిగేడు, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రంలోని రైతు గుజ్జుల కనకయ్యకు చెందిన గొర్రెలపై గురువారం తెల్లవారుజామున కుక్కలు దాడి చేశాయి.ఇంటి సమీపంలోని దొడ్డిలోకి చొరబడి దాడి చేయడంతో 7 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. గొర్రెల పెంపకమే జీవనాధారంగా ఉన్న కనకయ్యకు సుమారు 80 వేల రూపాయల వరకు నష్టం వాటిల్లింది.ప్రభుత్వం స్పందించి తనను ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశాడు.

# టీపీఎస్ నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్



**వంగూరు, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వంగూరు మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్) పనులను జిల్లా కలెక్టర్ బనావత్ సంతోష్ గురువారం ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గడువులోగా మోడల్ స్కూల్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యా సదుపాయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, టీపీఎస్ నిర్మాణం పూర్తయితే స్థానిక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.

# నిర్లక్ష్యం వీడితే.. ప్రాణాలు పదిలం

- ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు




**ఆమనగల్లు, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** వాహనదారులు నిర్లక్ష్యం వీడితే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్స్ 'అలైవ్- అరైవ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీటుబెల్టు పెట్టుకోవాలని పలు ఉదాహరణలతో వివరించారు. అతివేగం ప్రమాదకరమని, మద్యం సేవించే ఏ వాహనాన్ని నడపరాదన్నారు. వాహనదారులు చేసే అశ్రద్ధతో ప్రమాదాలు జరిగి కుటుంబాలు రోడ్డున పడే దుస్థితి తెచ్చుకోవద్దన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. సమావేశం అనంతరం ఆయా శాఖల అధికారులు, డ్రైవర్లు వాహనదారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యమన అధికారి సురేష్, ఎంపీడీవో కుసుమ మాధురి, తహసిల్దార్ ఫహీం ఖాద్రి, సీఐ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, ఎంఈఓ పాండు నాయక్, సీడీపీఓ శాంతి రేఖ, ఇరిగేషన్ ఏఈ తిరు సత్తయ్య, మిషన్ భగీరథ వ్యవసాయ అధికారులు శ్రీనివాస్ గౌడ్, శోభారాణి, మండల సూపర్డెంట్ సుమలత, హౌసింగ్ ఏఈ శాలిని, ఎంపీఓ లక్ష్మణ్, డాక్టర్ మైమున బేగం, హెచ్ఈఓ తిరుపతిరెడ్డి, ఆయాగ్రామాల సర్పంచులు మండ్లి రాములు, శానమని సత్యం, శ్రీను నాయక్, యాదయ్య, వెంకటయ్య, మౌనిక, ప్రశాంతి, శ్రీలత, ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్ తదితరులు ఉన్నారు.

# యూత్ ఆకట్టుకుంటున్న గౌతమ్ జిమ్

-ట్రైనర్ ఆధ్వర్యంలో సిక్స్ ప్యాక్

-యూత్ ను అందంగా తయారు చేస్తున్న జిమ్ ట్రైనర్

**గోదావరిఖని న్యూస్ ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** గోదావరిఖనిలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద గౌతం జిమ్ యువతను ఆకట్టుకుంటూ అతి తక్కువ 300 రూపాయలు ఫీజుతో యువతను ఆకర్షిస్తూ జిమ్ లో అధునాతనమైన ఎక్విప్ మెన్స్ ఏర్పాటు చేసి జిమ్ లో మంచి ట్రైనర్ ను ఏర్పాటు చేసి సిక్స్ ప్యాక్ కొరకు యువతకు ట్రైనింగ్ ఇస్తూ యువతను చాలా ఫిట్నెస్ గా తయారు చేస్తున్న గౌతమీ జిమ్ లో వేసవి సెలవుల్లో ఉదయము సాయంకాలం యువకులు అధిక సంఖ్యలో పాల్గొంటూ ఉన్నారు.

# అభివృద్ధి పథకాల అమలు పై తహసీల్దార్ కార్తీక్ కుమార్ సమీక్ష




**వెల్దండ, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై మండల స్థాయి సమీక్ష సమావేశం జరిగింది.ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై, రాబోయే రోజుల్లో ప్రవేశపెట్టబోయే కొత్త పథకాలపై విస్తృతంగా చర్చించారు. అధికారులు, సర్పంచులు, వార్డు సభ్యులు హాజరై అమలు విధానాలపై సూచనలు అందించారు.కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణయ్య, మండల ప్రత్యేక అధికారి విజయశ్రీ, మండల తహసీల్దార్ కార్తీక్ కుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ఉచిత మోటార్ సైకిళ్ల పంపిణీ





**షాద్‌నగర్, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో దివ్యాంగుల సహకార సంస్థ ద్వారా ఉచిత మోటార్ సైకిళ్ల పంపిణీ కార్యక్రమం షాద్‌నగర్‌లో జరిగింది.ఈ సందర్భంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు మోటార్ సైకిళ్లు అందజేశారు.కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ ఛైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, చించోడు సర్పంచ్ శ్రీనివాస్, చిలకమర్రి సర్పంచ్ రవీందర్ రెడ్డి, రాజు, హైదర్ గోరి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలు



**ఆమనగల్లు, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ అయ్యప్ప కొండ అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రీ హరిహర పుత్రుడు శ్రీ అయ్యప్ప స్వామి వారి జన్మదిన వేడుకలను బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, ఆలయ ట్రస్ట్ చైర్మన్ తల్లోజు ఆచారి ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పంచామృతం అభిషేకాలతో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లోజు ఆచారి మాట్లాడుతూ.. అయ్యప్ప దేవాలయంలో స్వామి వారి జన్మదిన వేడుకలను నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. వేడుకల్లో పట్టణ ప్రజలు, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# 20న ఉచిత కంటి వైద్య శిబిరం

**ఆమనగల్లు, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు వారి ఆధ్వర్యంలో ఈ నెల 20న ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న రాంరెడ్డి లయన్ ఐ హాస్పిటల్ విజన్ సెంటర్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ పిఆర్ఓ ఎం ఏ పాష తెలిపారు. ఆమనగల్లు మండల పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటిచూపు మందగించిన వారు తమ గుర్తింపు కార్డులైన ఆధార్ లేదా రేషన్ కార్డుతమ వెంట తెచ్చుకోవాలని ఆయన సూచించారు.

# తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

-- రాజశేఖర్ రెడ్డి



**వంగూరు, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వంగూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, బిఆర్ఎస్ పార్టీ ప్రజలను తప్పుదోవ పట్టించే తప్పుడు ప్రచారాలు మానుకోవాలని తీవ్రంగా విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని తెలిపారు.కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, జిల్లా సెక్రటరీ యాదగిర్ రావు, జిల్లా జనరల్ సెక్రటరీ కృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ యాదయ్య, రంగాపూర్ సర్పంచ్ క్యామ మల్లయ్య, ఉప్పలపాడు సర్పంచ్ ఖలీల్, తుమ్మలపల్లి సర్పంచ్ సురేష్, ఉల్లంపల్లి సర్పంచ్ సలేశ్వరంతో పాటు కాంగ్రెస్ నాయకులు హమీద్, కృష్ణ, సతీష్ రెడ్డి, విష్ణు, మోహన్, నందు, వినోద్ పాల్గొన్నారు.

# దివ్యాంగులకు 6000 పింఛన్లు వెంటనే అమలు చేయాలి -- టీఆర్ఎస్వీ



**జవహర్‌నగర్, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి ఆధ్వర్యంలో జవహర్‌నగర్ సూర్యనగర్ కాలనీలో రాష్ట్ర కమిటీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొనార్ దుర్గ ప్రసాద్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా టీఆర్ఎస్వీ వ్యవస్థాపక అధ్యక్షుడు మహమ్మద్ మున్నా, రాష్ట్ర అధ్యక్షుడు డా. షేక్ నయీమ్ పాల్గొన్నారు. టీఆర్ఎస్వీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ మరియు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సుతారి రమేష్కు నియామక పత్రం అందజేశారు.మహమ్మద్ మున్నా మాట్లాడుతూ, దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం టీఆర్ఎస్వీ ఎల్లప్పుడూ పోరాటం చేస్తుందని, ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ముఖ్యంగా దివ్యాంగులకు నెలకు 6000 రూపాయల ఆసరా పింఛన్లు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు అమలు చేయకపోవడం దారుణమని అన్నారు.2016 వికలాంగుల హక్కుల చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వ అసమర్థత స్పష్టమైందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలని టీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# ఓదెల మల్లికార్జున స్వామి చైర్మన్‌కు ఘన సన్మానం



**ఎలిగేడు, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఓదెల మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్‌గా ఇటీవల ఎన్నికైన చీకట్ల మొండయ్య మొట్టమొదటిసారి ఎలిగేడు మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘన సన్మానం జరిగింది.ఈ సందర్భంగా సంఘ నాయకులు ఆయనను శాలువాలు, పూలమాలలతో సత్కరించి, అభినందనలు తెలిపారు. దేవస్థానం అభివృద్ధి కోసం ఆయన కృషి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు కోడూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి గాజంగి నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు సాయిరి మహేందర్, సెక్రటరీ బూర్ల సత్యనారాయణ, నాయకులు వెంగళ్లాస్ రాజమౌళి, భాస్కర్, బూర్ల సత్తన్న, దూడం వీరేశం, కట్ల ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

## తేజస్వి సూర్య వ్యాఖ్యలు

# తెలంగాణ ఆత్మగౌరవం పై దాడి

- తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి డిమాండ్



**హైదరాబాద్, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్--పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని, నాలుగు కోట్ల ప్రజల మనోభావాలను తీవ్రంగా గాయపరిచాయని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి గురువారం విలేఖరులతో మాట్లాడుతూ ఖండించారు."తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం పార్లమెంటులో ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా జరిగిన ప్రక్రియ. దానిని రక్తపాతం, మత విభజనతో పోల్చడం చారిత్రక అజ్ఞానం మాత్రమే కాక రాజ్యాంగాన్ని అవమానించడమే అవుతుంది" అని ఆయన మండిపడ్డారు. ఉద్యమకారుల త్యాగాలను, ప్రజల ఆకాంక్షలను చులకన చేస్తూ మాట్లాడటం ఒక పార్లమెంట్ సభ్యుడి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని పాండురంగారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇప్పటికే స్పందించి, బీజేపీ ఎంపీలు మౌనం వీడి తేజస్వీ సూర్య వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని కించపరిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు."తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచిన బీజేపీ ఎంపీలు తమ పార్టీ సహచరుడి వ్యాఖ్యలను ఖండించి రాష్ట్ర ప్రయోజనాల కోసం నిలబడాలి. తెలంగాణ అస్తిత్వంపై దాడి చేసే ఏ శక్తినైనా ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కొంటాం" అని పాండురంగారెడ్డి స్పష్టం చేశారు.

## ప్రభుత్వ పథకాలపై ప్రజలకు

# అవగాహన కల్పించాలి

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి





**ఆమనగల్లు , ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో సమస్యలు లేకుండా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికల కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. గురువారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.. ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రతి అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం అందించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని, ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మండల సమావేశంలో లేవనెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డి ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి విజ్ఞప్తిని ప్రాధాన్యంగా పరిగణించి, నిర్ణీత కాలంలో పరిష్కారం చూపించాలని సూచించారు. గ్రామ స్థాయిలో ఎదురవుతున్న తాగునీరు, రహదారులు, విద్యుత్, ఇతర మౌలిక వసతుల సమస్యలను వెంటనే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమైన సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, జిల్లా ఉద్యమన అధికారి సురేష్, ఎంపీడీవో కుసుమ మాధురి, తహసిల్దార్ ఫహీం ఖాద్రి, సీఐ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, ఎంఈఓ పాండు నాయక్, సీడీపీఓ శాంతి రేఖ, ఇరిగేషన్ ఏఈ తిరు సత్తయ్య, మిషన్ భగీరథ వ్యవసాయ అధికారులు శ్రీనివాస్ గౌడ్, శోభారాణి, మండల సూపర్డెంట్ సుమలత, హౌసింగ్ ఏఈ శాలిని, ఎంపీఓ లక్ష్మణ్, డాక్టర్ మైమున బేగం, హెచ్ఈఓ తిరుపతిరెడ్డి, ఆయాగ్రామాల సర్పంచులు మండ్లి రాములు, శానమని సత్యం, శ్రీను నాయక్, యాదయ్య, వెంకటయ్య, మౌనిక, ప్రశాంతి, శ్రీలత, ఉప సర్పంచ్ విజయరాథోడ్ మరియు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, నాయకులు మెకానిక్ బాబా, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, విజయ్ నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, కుమార్ గౌడ్, షాబొద్దీన్, శేఖర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఈ నెల 20న శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ శంకుస్థాపన



**మర్రిగూడ, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం ప్రాంగణంలో కొత్తగా శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు, దేవస్థానం కమిటీ సంకల్పించారు. రోహిణి నక్షత్ర యుక్త మిథున లగ్న పుష్కరాంశ శుభ ముహూర్తంలో ఏప్రిల్ 20, 2026న ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన జరగనుంది. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింతగా పెంపొందించే ఈ ఆలయం నిర్మాణం స్థానిక భక్తులకు ఆనందాన్ని కలిగిస్తోంది.

## ధర్మవీర్ ప్రజాపతిని మర్యాదపూర్వకంగా కలిసిన కాసుల సురేష్



**మహేశ్వరం, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని సిరిగిరిపురం గ్రామ మాజీ సర్పంచ్ కాసుల సురేష్ ఉత్తరప్రదేశ్ హోంమంత్రి ధర్మవీర్ ప్రజాపతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## వేం నరేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపిన చిలుక మధుసూదన్ రెడ్డి



**ఇబ్రహింపట్నం , ఏప్రిల్16 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ సలహాదారులుగా ఉన్న వేం నరేందర్ రెడ్డి . తెలంగాణ రాష్ట్రం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికై గురువారం ఉదయం డిల్లి పార్లమెంట్ లో రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన వేం నరేందర్ రెడ్డి ని దేశ రాజధాని ఢిల్లీలోని తెలంగాణ భవన్ లో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంద్భంగా చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ... కష్టపడే ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని అందుకు నిదర్శనం వేం నరేందర్ రెడ్డి అని ఆయన అన్నారు. నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యులుగా నియామకం కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

### - కౌన్సిలర్ పాపిశెట్టి రాము



**ఆమనగల్లు, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి తోడు స్వచ్ఛంద సంస్థలు సైతం ముందుకు రావడం అభినందనీయమని ప్రముఖ సంఘ సేవకులు, ఆమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము అన్నారు. గురువారం మండల పరిధిలోని కోనాపూర్ గ్రామంలో హైదరాబాద్ కు చెందిన శ్రీవాణి భాస్కర్ దంపతులు వారి కుమార్తె నిషిత పేరుతో నిషా ఫౌండేషన్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్ పాపిశెట్టి రాము, ఎంఈఓ పాండు ముఖ్య అతిథులుగా హాజరై గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, ప్లేట్స్, వాటర్ బాటిల్, గ్లాస్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. నేడు సమాజంలో ఉన్నత స్థానాల్లో ఉన్న వారు చాలామంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నవారేనని గుర్తు చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని కోరారు. తమ వంతు సామాజిక బాధ్యతగా విద్యార్థులకు అందించిన నిషా ఫౌండేషన్ షూస్ నిర్వాహకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు జయకుమార్ సుజాత, పాఠశాల హెడ్మాస్టర్ విజేత, ఉపాధ్యాయులు కిరణ్, స్వాతి, శ్రీలత, పద్మ మరియు శ్రీను నాయక్, శివకృష్ణ, భాస్కర్, శ్రీనాథ్, ఈదమయ్య, రమేష్, మహేష్, శేఖర్, జగన్, మహేష్, నారయ్య, ప్రేమలత, సంతోషి, కుమార్, వెంకటేష్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

## ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి ఘన సన్మానం



**ఇబ్రహింపట్నం , ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్ )** నవోదయ, సైనిక్ , గురుకుల ఎంట్రెన్స్ లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన యాచారం మండలం నల్లవెల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థి జిల్లా మోక్షజ్ఞ తండ్రి జిల్లా జంగయ్య ను నల్లవెల్లి గ్రామ ప్రజలు మరియు పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. నిరుపేద కుటుంబం లో జన్మించి నవోదయ, సైనిక్, గురుకుల పాఠశాలలకు ఎన్నికై ప్రభుత్వ బడి సత్తా చాటి చెప్పిన విద్యార్థిని గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రావణ్. ఉపాధ్యాయులు వెంకటయ్య. భాస్కర్ రావు. సంజయ్ కుమార్. ప్రేమ్ కుమార్, మరియు గ్రామస్థులు పాల్గొన్నారు

## 14 ఏళ్ల ఆడపిల్లలకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలి

### - వైద్యాధికారి రమ్య



**ఆత్మకూరు, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నుండి గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నివారణ కోసం ప్రత్యేక వ్యాక్సిన్ కార్యక్రమం ప్రారంభమైంది. 2010 డిసెంబర్ 8 నుండి 2012 మార్చి 31 మధ్య జన్మించిన, ప్రస్తుతం 14 సంవత్సరాలు నిండిన ఆడపిల్లలందరికీ హ్యూమన్ పాపిల్లోమా వైరస్ వ్యాక్సిన్ అందజేస్తున్నామని మండల వైద్యాధికారి డాక్టర్ రమ్య తెలిపారు. ఈ వ్యాక్సిన్ వలన గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ రాకుండా నిరోధించబడుతుందని, ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవని ఆమె స్పష్టం చేశారు. గౌరవ మెడికల్ ఆఫీసర్ సమక్షంలో మాత్రమే ఈ వ్యాక్సిన్ ఇవ్వబడుతుందని, అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చి తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించుకోవాలని వైద్యాధికారి విజ్ఞప్తి చేశారు.

# ఎలిగేడులో ప్రజా పాలన

## - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం



ఎలిగేడులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై సమావేశం నిర్వహిస్తున్న అధికారులు



**ఎలిగేడు, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజా పాలన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఎలిగేడు మండల కేంద్రంలోని మధుర ఫంక్షన్ హాల్‌లో గురువారం మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి గౌరవ మండల ప్రత్యేక అధికారి నరేష్ కుమార్ నాయుడు అధ్యక్షత వహించగా, మండల పరిషత్ అభివృద్ధి అధికారి యాదగిరి భాస్కర్ రావు ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది.ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి అధికారులు ప్రజలకు విపులంగా వివరించారు. పథకాల ప్రయోజనాలు ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేయాలని సూచించారు.కార్యక్రమంలో తహసీల్దార్ యాకన్నా, సుల్తానాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బారెడ్డి, ఎలిగేడు ఎస్సై మధుకర్, మండల విద్యాధికారి నరేంద్ర చారి, మెడికల్ ఆఫీసర్ నిస్సి క్రిస్టిన్, పశువుల వైద్య అధికారి ఝాన్సీతో పాటు అన్ని గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, ఏపీఎం, సీసీలు, ఏఈఓలు, ఏఎన్ఎంలు, వీవోఏలు, ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది, మహిళలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జయ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**ఎలిగేడు, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండల కేంద్రంలో జయ్ క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం స్థానిక సర్పంచ్ కప్పల ప్రవీణ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరకంగా, మానసికంగా ఉల్లాసాన్ని కలిగిస్తాయని, యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడంలో ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. టోర్నమెంట్ నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు.కార్యక్రమంలో ఎండి మాలిక్, భూమేష్, చలందుల రాజయ్య, బి. సుమన్, మారుతి, నిర్వాహకులు బాసంపల్లి వినోద్, అల్లి రమేష్, గోష్క అక్ష కుమార్ తదితరులు పాల్గొన్నారు. క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై టోర్నమెంట్ ప్రారంభోత్సవాన్ని ఉత్సాహంగా వీక్షించారు.

# ఆమనగల్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా వడ్త్యావత్ శ్రీను నాయక్



**ఆమనగల్, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆమనగల్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా రాంనుంతల గ్రామ సర్పంచ్ వడ్త్యావత్ శ్రీను నాయక్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని సర్పంచులు సమావేశమై సర్పంచుల సమస్యలు, పెండింగ్ బిల్లుల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలు, గౌరవ వేతనం పెంపు వంటి అంశాలపై చర్చించి, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే బాధ్యతను సంఘం అధ్యక్షుడిగా శ్రీను నాయక్‌కు అప్పగించారు.ఉపాధ్యక్షులుగా మంగళపల్లి సర్పంచ్ కె. మౌనిక, శెట్టిపల్లి సర్పంచ్ టి. జంగమ్మను ఎన్నుకోగా, ప్రధాన కార్యదర్శిగా ఆకుతోటపల్లి సర్పంచ్ ఎన్. నరేందర్ రెడ్డి, కోశాధికారిగా సింగంపల్లి సర్పంచ్ సత్యం, కార్యదర్శిగా పోలేపల్లి సర్పంచ్ వెంకటయ్యను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా మండలంలోని సర్పంచులు పెద్ద సంఖ్యలో పాల్గొని, కొత్తగా ఎన్నికైన సంఘం అధ్యక్షుడు శ్రీను నాయక్‌కు అభినందనలు తెలిపారు. తనను ఈ బాధ్యతకు ఎన్నుకున్నందుకు సర్పంచులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతూ, ప్రజా సేవలో మరింత కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# కార్పొరేట్‌కు ధీటుగా యూనివర్సల్ విద్యార్థుల విజయం

- -నవోదయ ఫలితాల్లో మెరిసిన యూనివర్సల్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు
- -34 మందికి సీట్లు.. ప్రతి యేటా ఇదే తరహా ఫలితాలు
- -ప్రపంచంలో శక్తివంతమైనది కేవలం విద్య ఒక్కటే
- -చిన్నపిల్లలు ఇష్టంగా చదవడం అలవాటు చేసుకోవాలి
- -గ్రామీణ విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడమే తమ లక్ష్యం
- -ఇబ్రహీంపట్నం యూనివర్సల్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ బాలరాజ్
- -యూనివర్సల్ కోచింగ్ సెంటర్ కు వెల్లువెత్తుతున్న అభినందనలు
- -ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు





**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 16 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
ఇబ్రహీంపట్నం కేంద్రంగా విద్యా సేవలను అందిస్తున్న యూనివర్సల్ కోచింగ్ సెంటర్ మరోసారి విశిష్ట ఫలితాలతో అందరి ప్రశంసలు అందుకుంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఈ సంస్థ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విశేష విజయాన్ని సాధించారు. మొత్తం 34 మంది విద్యార్థులు నవోదయ విద్యాలయాల్లో ఉచిత విద్యకు ఎంపిక కావడం ద్వారా సంస్థ ప్రతిష్టను మరింతగా పెంచారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు కార్పొరేట్ స్థాయి పోటీని తట్టుకుని ఈ విజయాన్ని సాధించడం విశేషంగా చెప్పుకోవాలి. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో గత ఏడు సంవత్సరాలుగా నిరంతరంగా విద్యా సేవలు అందిస్తున్న యూనివర్సల్ కోచింగ్ సెంటర్, తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తూ పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తోంది. ప్రతి సంవత్సరం నవోదయ, సైనిక్ స్కూల్ ప్రవేశాలు వంటి ప్రతిష్టాత్మక పరీక్షల్లో అధిక సంఖ్యలో విద్యార్థులను విజయపథంలో నడిపిస్తూ ముందంజలో కొనసాగుతోంది. ఈ సంవత్సరం వచ్చిన ఫలితాలు ఆ కృషికి నిదర్శనంగా నిలిచాయి. ఈ విజయాన్ని సాధించిన విద్యార్థుల్లో మోక్షిత్, ప్రణయ్ రాజ్, కె.జయప్రకాశ్, ఎం.వైదిక్, శ్రీఆదిత్యవర్ధన్, ఏ. హర్షిత్ తేజ్, అకిరానందన్, సమన్వీ, రిత్విక్, హిమాన్షు, తేజశ్విని, మోక్షజ్ఞ, నిహాళ్, ఆశ్వత్, సాయితనీష్, రేహాన్, హర్షిత్, జ్ఞానేష్, త్రివిక్రమ్, ఎన్.రిత్విక్, సాత్విక్, మోక్ష, అనీష్, సాయిప్రణవ్, వర్షిణి, చిత్రిక్, శ్రీమహా, వైష్ణవి, గౌతమ్, వంధన, చరణ్ తేజ్, గౌతమ్ వర్మ, ప్రణయ్ కుమార్, అభినయా, తదితరులు తమ ప్రతిభను చాటుకున్నారు. వీరందరూ క్రమశిక్షణతో చదువుతూ, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో నిరంతరం శ్రమించి ఈ స్థాయికి చేరుకున్నారు. ఫలితాల విడుదల అనంతరం బుధవారం యూనివర్సల్ కోచింగ్ సెంటర్‌లో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులను శాలువాలతో సత్కరించి, వారి తల్లిదండ్రుల సమక్షంలో అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ కోచింగ్ సెంటర్ నిర్వహణకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఈ విజయాన్ని సంబరంగా జరుపుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు తక్కువ ఖర్చుతో ఉత్తమ విద్య అందించాలనే సంకల్పంతో ఈ సంస్థ ముందుకు సాగుతోంది. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా విద్యార్థులను తయారు చేస్తూ, వారి భవిష్యత్తును సుస్థిరంగా నిర్మించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ విజయంతో సంస్థపై తల్లిదండ్రుల విశ్వాసం మరింత పెరిగింది. ఇదిలా ఉండగా, రాబోయే విద్యాసంవత్సరానికి సంబంధించిన నవోదయ మరియు సైనిక్ కోచింగ్ తరగతులు మే రెండో వారంలో ప్రారంభమవుతాయని డైరెక్టర్ ఎ.బాలరాజ్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు, తల్లిదండ్రులు ముందుగానే నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 6302224279, 8885481117 సంప్రదించాలని కోరారు. మొత్తానికి, యూనివర్సల్ కోచింగ్ సెంటర్ సాధించిన ఈ విజయం కేవలం ఒక ఫలితం మాత్రమే కాదు, గ్రామీణ విద్యార్థులకు ఒక ప్రేరణ, ఒక నమ్మకం. సరైన మార్గదర్శకత్వం ఉంటే ఏ స్థాయికి అయినా చేరుకోవచ్చని ఈ ఫలితాలు మరోసారి నిరూపించాయి. దీంతో యూనివర్సల్ కోచింగ్ సెంటర్ ఉపాధ్యాయులు ధనంజయ్, విష్ణు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

# రెవెన్యూ అధికారులకు మేయర్ హెచ్చరికలు



**కరీంనగర్, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో రెవెన్యూ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, 5% రిబేట్ పథకం కింద పన్నుల వసూళ్లు, మ్యూటేషన్లు, రివిజన్ పిటిషన్లు, అసెస్మెంట్, సెల్ఫ్ అసెస్మెంట్, డబుల్ ఇంటి నంబర్ల సమస్యలపై చర్చ జరిగింది.నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, రెవెన్యూ అధికారులు ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా ప్రజలకు జవాబుదారితనంతో పని చేయాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించాలని, పన్నుల వసూళ్లలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారుల విధి నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, పాలనలో పారదర్శకత పాటించాలని హెచ్చరించారు. టాక్స్ ఎక్కువగా ఉండి తక్కువగా వసూలవుతున్న అసెస్మెంట్లను తనిఖీ చేసి సరిచేయాలని ఆదేశించారు.ప్రజలకు జవాబు దారితనంతో పని చేయాలని, లీగల్ సమస్యలపై ఎవరైనా పేరు చెప్పుకొని వస్తే స్పందించవద్దని, న్యాయబద్ధంగా ఉన్న దరఖాస్తులను మాత్రమే పరిష్కరించాలని స్పష్టం చేశారు. 5% రిబేట్ పథకం కింద 15 రోజుల్లో లక్ష్యానికి అనుగుణంగా పన్నులు వసూలు చేయాలని, ప్రజల్లో రాయితీపై అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సమావేశంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్లు ఖాదర్ మొహియుద్దీన్, వేణు మాధవ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సెక్షన్ క్లర్కులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉచిత రిజిస్ట్రేషన్




**కరీంనగర్, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), కరీంనగర్‌లో డిగ్రీ ప్రథమ సంవత్సర అడ్మిషన్ల కోసం ఉచిత రిజిస్ట్రేషన్ ప్రారంభమైంది. ఇటీవల విడుదలైన దోస్త్ నోటిఫికేషన్ ప్రకారం మూడు విడతలుగా అడ్మిషన్లు జరగనున్నాయి. మొదటి విడత రిజిస్ట్రేషన్ ఈ నెల నుండి వచ్చే నెల 7వ తేదీ వరకు కొనసాగుతుంది. వెబ్ ఆప్షన్స్ ఈ నెల 30వ తేదీ నుండి వచ్చే నెల 8వ తేదీ వరకు ఇవ్వాలి. సీట్ల కేటాయింపు మే 14న జరుగుతుంది.ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థినులకు కళాశాలలో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి వెబ్ ఆప్షన్స్ పెట్టే అవకాశం కల్పిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి తెలిపారు. విద్యార్థినులు కేవలం రిజిస్ట్రేషన్ ఫీజు మాత్రమే చెల్లించి, అవసరమైన సర్టిఫికెట్లతో కళాశాలను సంప్రదించాలని సూచించారు.కళాశాలలో బి.ఎ., బి.కాం., బి.ఎస్సీ. లైఫ్ సైన్స్, ఫిజికల్ సైన్స్ కోర్సులతో పాటు అప్రెంటిసెషిప్ ఎంబెడెడ్ కోర్సులు బి.కాం. (బి.ఎఫ్.ఎస్.ఐ), బి.ఎస్సీ. (హెల్త్‌కేర్ మేనేజ్మెంట్), బ్యూటీ అండ్ వెల్నెస్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

# దివ్యాంగుల ఉపాధి కల్పనపై అవగాహన సదస్సు



**కరీంనగర్, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
యూత్4జాబ్స్ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగుల ఉపాధి కల్పన, ఆర్పిడబ్ల్యుడి చట్టం--2016పై స్థానిక యజమానులకు అవగాహన సదస్సు విజయవంతంగా నిర్వహించబడింది. జిల్లాలోని 35 ప్రముఖ సంస్థలు, టైర్-3 వ్యాపార సంస్థలు, పాన్-ఇండియా స్థాయి టైర్-2 కంపెనీలు ఇందులో పాల్గొన్నాయి.యూత్4జాబ్స్ మేనేజర్ షాహెద్, అసిస్టెంట్ మేనేజర్ రాజమౌళి, వై4జె బృంద సభ్యులు దివ్యాంగులను ఉద్యోగాల్లోకి తీసుకోవడం వల్ల కలిగే వ్యాపార ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, పన్ను రాయితీలు, తెలంగాణ ప్రభుత్వం అందించే నెలకు 500రూ ఇన్సెంటివ్, ఈపీఎఫ్ ఊ ఈఎస్ఐ రీయింబర్స్‌మెంట్ వంటి అంశాలను వివరించారు.సదస్సులో నిర్వహించిన కార్యకలాపాలు, ప్రత్యక్ష అనుభవాల ద్వారా యజమానుల్లో గణనీయమైన మార్పు వచ్చింది. దివ్యాంగుల నియామకం సేవ కాదు, వ్యాపారానికి లాభం అనే భావనను యజమానులు అర్థం చేసుకున్నారు. అనంతరం పలువురు తమ సంస్థల్లో దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సిద్ధత వ్యక్తం చేశారు. నిర్వాహకులు ఇది జిల్లాలో దివ్యాంగుల ఉపాధికి పెద్ద ముందడుగు అని పేర్కొన్నారు. యూత్4జాబ్స్ సంస్థ దేశవ్యాప్తంగా దివ్యాంగులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తూ పనిచేస్తోంది.

# బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా ప్రదీప్ యాదవ్



**మానకొండూర్, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణరెడ్డి ఆదేశాల మేరకు, మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డి మానకొండూర్ మండల కమిటీ నూతన కార్యవర్గంలో భాషబోయిన ప్రదీప్ యాదవ్‌ను మండల ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ప్రదీప్ యాదవ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణరెడ్డి, మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డి, జిల్లా మరియు మండల నాయకులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కట్టుబడి పనిచేస్తానని, అందరి ఆశీస్సులు ఎల్లప్పుడూ తనపై ఉండాలని కోరుకున్నారు.ఈ నియామకంతో మానకొండూర్ మండల బీజేపీ కమిటీకి కొత్త ఉత్సాహం లభించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

## సమస్యల వలయంలో బసంతనగర్ బస్టాండ్



**పాలకుర్తి, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నిత్యం వందలాది మంది ప్రయాణికులతో రద్దీగా ఉండే బసంతనగర్ బస్టాండు సమస్యలకు నిలయంగా మారింది. చదువు, ఉద్యోగం, వ్యాపారాల కోసం ప్రతిరోజు ఇక్కడి నుండి దూరప్రాంతాలకు వెళ్ళే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.బస్టాండు వద్ద ద్విచక్రవాహనాల పార్కింగ్ స్థలం లేకపోవడంతో బైకులు ప్రధాన రోడ్డుపైనే నిలిపి ఉంచడం వల్ల రోడ్డు ఇరుకుగా మారి భారీ వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఆటో స్టాండ్ వద్ద షెల్టర్, త్రాగునీరు, టాయిలెట్స్, బెంచీలు లేక మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.హెచ్‌కే ఆర్ టోల్ గేట్ సంస్థ హైవే రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన బస్ షెల్టర్లు ప్రయాణికులకు ఉపయోగపడకపోవడం మరో సమస్య. వాటిలో ఒకదాన్ని ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ఆక్రమించగా, మరొకదాన్ని బైకులు పార్కింగ్ కోసం వాడుతున్నారు. దీంతో ప్రయాణికులు ఎండలో రోడ్లపైనే వేచి ఉండాల్సి వస్తోంది.ప్రయాణికులు వాపోతూ, గతంలో నాయకులు కనీస వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని తెలిపారు. టోల్ గేట్ యాజమాన్యం కూడా నిర్లక్ష్యం వహించడం వల్ల పరిస్థితి మరింత దారుణంగా మారిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు, టోల్ గేట్ యాజమాన్యం స్పందించి ప్రయాణికుల సౌకర్యార్థం కనీస వసతులు కల్పించాలని, ఆటో స్టాండ్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి సమస్యలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


## విద్యార్థులు ఉన్నత దశను చేరుకోవాలి




**కరీంనగర్, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్ట్స్ విభాగం జూనియర్ విద్యార్థులు తమ సీనియర్లకు వీడ్కోలు కార్యక్రమాన్ని “జ్ఞాపకాల ప్రతిధ్వనులు” పేరుతో ఘనంగా నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపల్ కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, క్రమశిక్షణ, పట్టుదల, కఠోర శ్రమ విజయానికి పునాదులని సూచించారు. సమాజ సంక్షేమం కోసం తమ విద్యను వినియోగించుకోవాలని కోరారు. వైస్ ప్రిన్సిపాల్ టి. రాజయ్య విద్యార్థులు నిబద్ధతతో, అంకితభావంతో తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. జూనియర్, సీనియర్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఈ వేడుకను ఉల్లాసభరితంగా మార్చాయి. విద్యార్థుల ప్రతిభ, సృజనాత్మకత, భావోద్వేగ బంధం ప్రతిబింబించాయి.ఈ కార్యక్రమంలో స్టాఫ్ క్లబ్ కార్యదర్శి మల్లారం శ్రీనివాస్ రెడ్డి, ఐక్యూఏసి కోఆర్డినేటర్ హర్ జ్యోతి కౌర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఉమా రాణి, అధ్యాపకులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.విద్యార్థులు తమ జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఉపాధ్యాయులకు, సంస్థకు కృతజ్ఞతలు తెలియజేయడంతో కార్యక్రమం భావోద్వేగభరిత వాతావరణంలో ముగిసింది.

# మెడికల్ షాపుల కార్యకలాపాలపై తలెత్తుతున్న అనుమానాలు

- తనిఖీలు చేపట్టాలని ప్రజల డిమాండ్




**హుస్నాబాద్ ,ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ పట్టణంలో మెడికల్ షాపుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో వాటి కార్యకలాపాలపై ప్రజల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే యాంటీబయాటిక్స్, పెయిన్‌కిల్లర్స్ వంటి మందులు ఇష్టానుసారంగా విక్రయిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారే అవకాశం ఉందని స్థానికులు పేర్కొన్నారు. కొన్ని షాపుల్లో బిల్లులు ఇవ్వకుండా మందులు అమ్మడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం నష్టం కలుగుతోందని, వినియోగదారులకు భరోసా లేకుండా పోతుందని తెలిపారు.నకిలీ లేదా గడువు ముగిసిన మందులు విక్రయిస్తున్నారన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అర్హతలేని సిబ్బంది ప్రజలకు మందులపై సలహాలు ఇస్తూ విక్రయాలు చేయడం మరింత ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వైద్యుల సూచన లేకుండా మందులు వాడటం వల్ల ఆరోగ్య సమస్యలు తీవ్రమయ్యే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి మెడికల్ షాప్‌కు చెల్లుబాటు అయ్యే లైసెన్స్‌తో పాటు అర్హత కలిగిన ఫార్మాసిస్ట్ ఉండాలి. కానీ ఈ నిబంధనలు ఎంతవరకు అమలవుతున్నాయన్నదిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ప్రజలు డిమాండ్ చేస్తూ, హుస్నాబాద్ పట్టణంలోని మెడికల్ షాపులపై డ్రగ్స్ కంట్రోల్ అధికారులు తక్షణమే ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే స్పందించాలని వారు విజ్ఞప్ చేశారు.

# ఉల్లంపల్లి గ్రామ అభివృద్ధి పనులపై స్పష్టత



**హుస్నాబాద్ , ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉల్లంపల్లి గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులపై 4వ వార్డు సభ్యుడు సయ్యద్ శరీఫ్ చేసిన ఆరోపణలు పూర్తిగా ఆధారరహితమని 8వ వార్డు సభ్యులు కోల రజిత చంద్రమోహన్ తెలిపారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, ఇంజినీరింగ్ ప్రమాణాల ప్రకారం జరుగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. సిమెంట్ నాణ్యత, ఇతర నిర్మాణ సామగ్రి అన్నీ సంబంధిత అధికారుల పర్యవేక్షణలోనే వినియోగిస్తున్నామని, ఒకే గ్రేడ్ సిమెంట్ అధికారుల ఆమోదంతోనే వాడుతున్నామని పేర్కొన్నారు. వాటరింగ్ సరిగా చేయడం లేదన్న ఆరోపణలను ఖండిస్తూ, సీసీ రోడ్లలో క్యూరింగ్ ఎంతో ముఖ్యమని తెలిసి ప్రతిరోజూ పర్యవేక్షణతో సరైన విధంగా వాటరింగ్ నిర్వహిస్తున్నామని వివరించారు. రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేయడం దురదృష్టకరమని, ఇలాంటి చర్యలు అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నమే తప్ప ప్రజల ప్రయోజనానికి కాదని అన్నారు.పబ్లిక్ ప్లాట్‌ఫామ్‌లలో బాధ్యతగా మాట్లాడాలని, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయకూడదని సూచించారు. అభివృద్ధి పనులకు సలహాలు ఇవ్వాలని కానీ ఆటంకాలు సృష్టించవద్దని విజ్ఞప్తి చేశారు. గ్రామ అభివృద్ధి అందరి బాధ్యత అని, పారదర్శకంగా సమాధానాలు ఇవ్వడానికి తాము ఎప్పుడూ సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అలువాల శంకర్, ఉప సర్పంచ్ కానవేణి జితేందర్, 9వ వార్డు సభ్యుడు కొత్త మధు, 5వ వార్డు సభ్యురాలు సుధగోని రమాదేవి, 2వ వార్డు సభ్యుడు కోల ప్రభాకర్, గ్రామస్తులు కొండ పూరిషోత్తం, జనవేణి వెంకటేష్, అలువాల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతాపై అవగాహన సదస్సులు




**కరీంనగర్, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.తిమ్మాపూర్ మండలంలోని వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ, రోడ్డు భద్రతా నిబంధనలు పాటించకపోవడం ప్రమాదాలకు ప్రధాన కారణమని, డ్రైవర్లు తప్పనిసరిగా కంటి పరీక్షలు, శారీరక పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గడువు ముగిసిన వాహనాలను రోడ్లపైకి రానీయకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదం జరిగిన గోల్డెన్ అవర్‌లో ప్రాథమిక చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.అదే రోజు కరీంనగర్ అస్త్ర కన్వెన్షన్ హాల్లో జరిగిన అరైవ్ అలైవ్ అవగాహన సదస్సులో రాష్ట్ర అడిషనల్ డీజీపీ (సీఐడీ ఒ ఏసీబీ) చారు సిన్హా మాట్లాడుతూ, యువత ప్రాణాలు అమూల్యమని, రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించడం తప్పనిసరి అని, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ వాడటం ప్రాణాపాయానికి దారితీస్తాయని హెచ్చరించారు.ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి వైద్యులు విద్యార్థులకు సీపీఆర్ విధానంపై ప్రత్యక్ష ప్రదర్శన ఇచ్చారు. మాక్స్ విజన్ ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం హెల్మెట్లు పంపిణీ చేశారు. కరీంనగర్ రూరల్ పోలీసులు దుర్షేడ్‌లో విద్యార్థులు, ప్రజలతో కలిసి మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, స్కూల్ వాహనాల్లో పరిమితికి మించి పిల్లలను తీసుకెళ్లడం, ఓవర్ స్పీడ్ వంటి సమస్యలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమాల్లో ఆర్టీసీ ఆర్‌ఎం రాజు, రవాణా శాఖ ఉప కమిషనర్ పెద్దింటి పురుషోత్తం, డిఎంహెచ్ఓ వెంకటరమణ, ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్, డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి, ఆర్డీవో మహేశ్వర్, గంద్ర శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.జిల్లా వ్యాప్తంగా జరిగిన ఈ అవగాహన కార్యక్రమాలు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో చైతన్యం పెంచాయి.

# సర్పంచ్ అవినాష్ సన్మానించిన పోలీస్ కృష్ణ

**టేక్మాల్ ప్రతినిధి ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మెదక్ జిల్లా టేక్మల్ మండల్ బొడ్మెట్పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సర్పంచ్ తలరి అవినాష్ ను శాలువా కప్పి సన్మానించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోలీస్ కృష్ణ అలియాస్( బంకు కృష్ణ), ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాగభూషణ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ రెడ్డి, వార్డ్ మెంబర్, గడ్డం గోపాల్, రవిశంకర్,నర్సింలు, శ్రీశైలం, ఆందోల్ విట్టల్, యువ నాయకులను ధనుంజయ, రాకేష్ రెడ్డి, శ్రవణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు



# స్వదేశీ యాంటీషిప్ మిస్సైల్‌ను పరీక్షించిన పాక్ నేవీ



**కరాచీ ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్వదేశీయంగా అభివృద్ధి చేసిన యాంటీషిప్ మిస్సైల్‌ను ఇవాళ పాకిస్థాన్ నేవీ విజయవంతంగా పరీక్షించింది. చాలా దూరంలో ఉన్న టార్గెట్లను ఆ మిస్సైల్ చేరుకోగలదని పాక్ మిలిటరీ పేర్కొన్నది. నౌకల నుంచి లాంచ్ చేసే ఆ యాంటీషిప్ మిస్సైల్‌ను నేవీ విజయవంతంగా పరీక్షించినట్లు ఐఎస్పీఆర్ ప్రకటించింది. నేవీ చీఫ్ అడ్మిరల్ నవీద్ అష్రఫ్‌తో పాటు ఇతర శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు .. మిస్సైల్ ఫైరింగ్ ఈవెంట్‌ను వీక్షించారు. అత్యాధునిక గైడెన్స్ సిస్టమ్‌తో పాటు అడ్వాన్స్‌డ్ మాన్యువరబులిటీ ఉన్నట్లు పేర్కొన్నారు. శత్రువుల క్షిపణుల నుంచి తప్పించుకునే సామర్థ్యం ఉన్నట్లు ప్రకటనలో తెలిపారు. పరిస్థితులకు తగినట్లు డైనమిక్‌గా మారుతుందని, చాలా కచ్చితత్వంతో ఆ క్షిపణి ప్రాణాంతకంగా మారుతుందని మిలిటరీ పేర్కొన్నది. ప్రాంతీయ సముద్ర భద్రత, స్థిరత్వం నేపథ్యంలో మిస్సైల్ ఫైరింగ్ ఈవెంట్ నిర్వహించినట్లు చెప్పారు. అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారి, ప్రధాని షెహబాజ్ షరీఫ్, సీడీఎఫ్ అసిమ్ మునీర్ తాజా పరీక్ష పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# తెలంగాణపై ఎంపీ తేజస్వి సూర్య వివాదాస్పద వ్యాఖ్యలు..



**న్యూఢిల్లీ ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య(MP Tejasvi Surya) వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించే ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బ్రిటీషర్ల కన్నా నీచమైన రీతిలో వ్యవహరించినట్లు ఆరోపించారు. ఇండియా , పాకిస్థాన్‌ను విడగొట్టినట్లుగా ఆంధ్రా, తెలంగాణను విభజించారని ఎంపీ సూర్య ఆరోపించారు. లోక్‌సభలో ఇవాళ రాజ్యాంగ సవరణ బిల్లులు ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును దేశవిభజనతో పోల్చడం పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

# దానిపై అంత భావోద్వేగం అక్కర్లేదు..

## 'అశోకచక్రం'పై పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయపతాకం పై అశోక చక్రం ను ఎలా చూపాలన్న దానిపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఈ అంశంపై విచారణకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. సమాజానికి ఉపయోగపడే అంశాలను ధర్మాసనం ముందుకు తీసుకురావచ్చు కదా అంటూ పిటిషనర్‌పై ధర్మాసనం అసహనం వ్యక్తంచేసింది. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఓ కూడలిలో ఉంచిన అశోక చక్రాన్ని ఉదహరిస్తూ పిటిషనర్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు.దీనిపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పందిస్తూ.. ఇలాంటి విషయాల్లో భావోద్వేగానికి గురికావాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించింది. పిటిషనర్ ఆలోచన మంచిదేనని, కానీ దీనిపై సంబంధిత అధికారులతో చర్చిస్తే సరిపోయేదని, దానిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాల్సిందని అసహనం వెలిబుచ్చింది. సమాజానికి ఉపయోగపడే పనులు, నిర్మాణాత్మకమైన పనులను చేయాలని ఈ సందర్భంగా పిటిషనర్‌కు సూచించింది.

# చలివేంద్రం ప్రారంభం..

**మంచిర్యాల ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మంచిర్యాల జిల్లా కేంద్రంలో బెల్లంపల్లి చౌరస్తాలో మహిళా తరంగిణి లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు.ఈ సందర్భంగా గురువారం చలివేంద్రంలో మజ్జిగను, పెరుగు అన్నంను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా తాము చలివేంద్రంలో మజ్జిగ, మంచినీళ్లను ప్రతి వేసవి కాలంలో ప్రజలకు అందిస్తున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు చంద్రకళ, ప్రధాన కార్యదర్శి కొత్త లీల, ట్రెజరర్ భాగ్యలక్ష్మి, మరియు గౌరవ అధ్యక్షురాలు ఇందిరా దేవి, అడ్వైజర్ భాగ్యలక్ష్మి, గంప వాణి ప్రియ,జ్యోత్స్న, తదితరులు,పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకై అవగాహన సదస్సు

**పెద్దపల్లి, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఎంబీ గార్డెన్స్‌లో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పింఛన్లు, గృహ జ్యోతి, వడ్డీ లేని రుణాలు వంటి పలు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. ప్రజల సూచనలతో పాలనను మరింత సమర్థవంతంగా చేయడానికి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కొనసాగుతోందని చెప్పారు.ఇటీవల రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్నాయని, తీవ్రవాద దాడులు లేదా రోగాల కంటే ప్రమాదాల వల్లే మరణాలు ఎక్కువగా ఉన్నాయని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరి అని సూచించారు. ప్రమాదం జరిగిన గోల్డెన్ అవర్‌లో





బాధితులను ఆసుపత్రికి తరలిస్తే రహవీర్ పథకం కింద రూ.25,000 ప్రోత్సాహకం, అలాగే రూ.1.5 లక్షల వరకు ఉచిత చికిత్స అందిస్తారని వివరించారు.అదే రోజు పెద్దపల్లి ఆర్.కే ఫంక్షన్ హాల్‌లో జరిగిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో డీసీపీ బి. రామ్ రెడ్డి, ఏసీపీ జి. కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. డీసీపీ మాట్లాడుతూ, నిర్లక్ష్యం, అతివేగం, ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. యువతలో బాధ్యతాయుత డ్రైవింగ్ అలవాట్లు పెంపొందించుకోవాలని సూచించారు.డిఫెన్సివ్ డ్రైవింగ్ ప్రాముఖ్యతను వివరించి, రోడ్డు పై పరిసరాలను గమనిస్తూ ఇతరుల పొరపాట్లను ముందుగానే అంచనా వేసి జాగ్రత్తగా వాహనం నడపడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, మొబైల్ ఫోన్ వాడకాన్ని నివారించడం వంటి ప్రాథమిక భద్రతా చర్యలు తప్పనిసరి అని సూచించారు. కార్యక్రమం ముగింపులో హాజరైన వారందరితో రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ప్రజలు, అధికారులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమాలు రోడ్డు ప్రమాదాల నివారణకు చైతన్యం పెంచాయి.

# జర్నలిస్ట్ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏర్పాటు


**పెద్దపల్లి, ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్‌లో జర్నలిస్ట్ సంక్షేమ సంఘం (జెఎస్ఎస్) ఎన్నికలు పారదర్శకంగా జరిగాయి. వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందని జాతీయ అధ్యక్షుడు మనసాని కృష్ణారెడ్డి తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు తక్కెళ్ళపల్లి శ్రీనివాస్ సూచనల మేరకు జిల్లా ఇంచార్జ్ కన్నూరి రాజు ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు జరిగింది.ఈ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా బందేల రాజు కుమార్, గౌరవ అధ్యక్షుడిగా మంద భాస్కర్ నియమితులయ్యారు. పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా వెన్నంపల్లి శ్రీనివాస్,



జనరల్ సెక్రటరీగా ఓడ్నాల తిరుపతి, ఉపాధ్యక్షుడిగా రావుల రాజ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మంథని రఘువీర ప్రసాద్, కోశాధికారిగా బీమనపల్లి ఓమేష్, ప్రచార కార్యదర్శిగా చిగూరు అనిల్, సహాయ కార్యదర్శిగా ఎస్కె షకీల్ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా అధ్యక్షుడు వెన్నంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, నాపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన కమిటీకి కృతజ్ఞతలు తెలుపుతూ, జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సభ్యులను చేర్చే నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.ఈ సమావేశంలో మహిళా సభ్యురాలు ఓడ్నాల లత, మాజీ జాతీయ కార్యదర్శి సబ్బితం లక్ష్మణ్, కంది కృష్ణారెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి కన్నూరి జేష్ కుమార్, చంద్రగిరి శివ, బచ్చెలి నర్సమ్మ, బొంకూరి శ్రీదర్ తదితరులు పాల్గొన్నారు.

# లష్కరే వ్యవస్థాపక సభ్యుడు ఆమిర్ హమ్‌జాపై కాల్పులు

**ఇస్లామాబాద్: ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా వ్యవస్థాపక సభ్యుడు ఆమిర్ హమ్‌జాపై గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. ఈ ఘటన లాహోర్‌లో జరిగింది. ప్రస్తుతం అతన్ని ఆస్పత్రిలో చేర్పించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పారు. ఉగ్రవాది హాఫీజ్ సయిద్‌తో కలిసి 1985లో లష్కరే తోయిబాను హమ్‌జా స్థాపించారు. ఇండియాలో జరిగిన అనేక ఉగ్రవాద కార్యకలాపాలకు అతనికి లింకులు ఉన్నాయి. హాఫీజ్ సయీద్ తర్వాత హమ్‌జా లష్కరే గ్రూపులో రెండో కీలక వ్యక్తిగా ఎదిగారు. హమ్‌జాను ఉగ్రవాదిగా అమెరికా




ముద్రవేసింది. లాహోర్‌లో ఉన్న ఓ న్యూస్ ఛానల్ ఆఫీసు ఆవరణలో అతనిపై కాల్పులు జరిపారు.1959లో ఆమిర్ హమ్‌జా జన్మించారు. అతను మాజీ ఆఫ్ఘన్ ముజాయిదిన్. లష్కరే ఐడియాలజీలో కీలక వ్యక్తి అతను. అతని వయసు 66 ఏళ్లు. చాలా ధాటిగా అతను మాట్లాడగలడు, రాయగలడు. టెర్రర్ గ్రూపుకు చెందిన ఓ పబ్లికేషన్‌ను అతను ఎడిట్ చేస్తాడు. అనేక పుస్తకాలు రాశాడతను. ఖాఫిలా దావత్, షాహదత్ బుక్స్ అతనే రాశాడు. 2018 నుంచి లష్కరేతో హమ్‌జా దూరంగా ఉంటున్నాడు. లష్కరే ఫండింగ్ పై ప్రభుత్వం నిఘా పెట్టడంతో అతను తన కార్యకలాపాలను తగ్గించుకున్నాడు. ఆ తర్వాత అతను జైషే మన్‌కాఫా సంస్థను స్థాపించాడు. దాని ద్వారా లష్కరే కోసం ఫండ్స్ సేకరించాడు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాల కోసం ఆ డబ్బును వాడేవాడు.

# యూరప్ దగ్గర ఆరు వారాలకు సరిపడ మాత్రమే జెట్ ఫ్యూయెల్ నిల్వలు..

## వెల్లడించిన ఐఈఏ చీఫ్

**న్యూఢిల్లీ ఏప్రిల్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇరాన్-అమెరికా యుద్ధం ప్రపంచ దేశాలను ఆందోళనలో నెట్టింది. అగ్రదేశాలుగా వెలుగొందుతున్న యూరప్ దేశాలు కూడా ఈ యుద్ధ ప్రభావంతో చమురు సమస్యను ఎదుర్కొంటున్నాయి. తాజా అంచనా ప్రకారం.. యూరప్ దగ్గర ఆరు వారాలకు సరిపడా మాత్రమే విమాన ఇంధనం నిల్వలు ఉన్నాయి. ఈ విషయాన్ని ఐఈఏ (ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ) చీఫ్ ఫాతి బిరోల్ వెల్లడించారు.ఇరాన్ యుద్ధ సంక్షోభం ఇంకొన్ని రోజులు కొనసాగితే, యూరప్ ఏవియేషన్ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని ఆయన అన్నారు.



ఇరాన్ యుద్ధం కారణంగా హోర్ముజ్ జలసంధిని అమెరికా మూసేసిన సంగతి తెలిసిందే. దీంతో యూరప్‌నకు చమురు రవాణా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో చమురు అంశంపై ఫాతి బిరోల్.. మీడియా సంస్థలతో మాట్లాడారు. ఈ పరిస్థితి ఇంకొన్ని రోజులు ఇలాగే కొనసాగితే ఇంధన కొరత కారణంగా విమానాల ప్రయాణాలు రద్దయ్యే పరిస్థితి ఉందన్నారు. "హోర్ముజ్ జలసంధి తిరిగి తెరవకపోతే విమాన ఇంధన కొరత తలెత్తి, విమానాల రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంది. గతంలో ఎప్పుడూ ఇలాంటి ఇంధన సంక్షోభం ఎదురుకాలేదు. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర సంక్షోభం ఎదురుకానుంది. హోర్ముజ్ జలసంధి ఎక్కువ కాలం అందుబాటులోకి రాకపోతే ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరుగుతుంది. గల్ఫ్ దేశాలపై ఎక్కువగా ఆధారపడే ఆసియా దేశాలపైనే ఎక్కువ ప్రభావం పడుతుంది. దక్షిణ కొరియా, ఇండియా, చైనా, బంగ్లాదేశ్ ముందుగా నష్టపోతాయి. తర్వాత యూరప్‌పై ప్రభావం ఉంటుంది" అని బిరోల్ అన్నారు. ఇప్పటికే అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.